
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
నంద్యాల జిల్లా వార్తలు 3
ఆదివారం 24 ఆగస్టు 2025



పేట్టుబడి పంతులయ్యారు..!







కోటి ఆశలతో లక్షలాది మంది నిరుద్యోగులు డీఎస్సీ కోసం ఎదురుచూశారు.. నోటిఫికేషన్ రానే వచ్చింది.. అహర్నిశలు శ్రమించారు.. రోజుకు పది నుంచి 12 గంటల పాటు పుస్తకాలతో కుస్తీ పట్టారు.. గురువులుగా ఎదగాలనే లక్ష్యంతో ముందుకు సాగారు.. పరీక్షలు రాసి ఇక ఫలితాల కోసం పడిగాపులు కాశారు.. వారి కలలు నెరవేరే సమయం ఆసన్నమైంది.. వారి కష్టానికి తగ్గ ఫలితం దక్కే ఘడియలు రానే వచ్చాయి. శనివారం ఎందరో నిరుద్యోగుల జీవితాల్లో ఉద్యోగ వెలుగులు వెలిగాయి. డీఎస్సీ ఫలితాలను రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసింది. అభ్యర్థికి వచ్చిన మార్కులు, మెరిట్ జాబితాలో వారి పేరు ఏస్థాయిలో ఉంది..? ఉద్యోగం వస్తుందా.. రాదా..? అని అభ్యర్థులు నిర్ధారణకు వస్తున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 5.77 లక్షల మంది నిరుద్యోగ ఉపాధ్యాయ అభ్యర్థులు దరఖాస్తులు చేస్తే, ఉమ్మడి కర్నూలు జిల్లాలోనే 53,787 మంది దరఖాస్తు చేయడం కొసమెరుపు. ఉపాధ్యాయ ఉద్యోగాలు సాధించిన అభ్యర్థుల్లో ఆనందోత్సాహాలు నెలకొన్నాయి. వారి కుటుంబాలు, బంధువులు, సన్నిహితులు హర్షం వ్యక్తం చేశారు.

- మెగా డీఎస్సీ-2025 మెరిట్ జాబితా విడుదల
- త్వరలో నియామక ప్రక్రియ పూర్తి.. పాఠశాలకు కేటాయింపు
- జిల్లాలో 2,645 ఉపాధ్యాయ ఖాళీలు భర్తీ
- టాపర్-1, 2లో వివిధ విభాగాల్లో 42 మంది అభ్యర్థులు
- సర్టిఫికెట్ల పరిశీలనకు డిప్యూటీ డీఈవో, ఎంఈవోలకు శిక్షణ
- ఎన్నికల హామీ నిలుపుకున్న కూటమి ప్రభుత్వం
- రేపటి నుంచి ధ్రువీకరణ పత్రాలు పరిశీలన

కర్నూలు, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ పోస్టుల భర్తీలో భాగంగా మెగా డీఎస్సీ-2025 పక్కా ప్రణాళికతో నిర్వహించారు. ఉమ్మడి కర్నూలు, నంద్యాల జిల్లాల్లో వివిధ విభాగాల్లో 2,645 ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. రాష్ట్రంలో అత్యధికంగా ఖాళీలు ఇక్కడే ఉండడంతో రాష్ట్రంలోని వివిధ జిల్లాలకు చెందిన నిరుద్యోగ ఉపాధ్యాయులు నాన్‌లోకల్ కేటగిరిలో అదృష్టాన్ని పరీక్షించుకోవడానికి దరఖాస్తులు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం శనివారం మెరిట్ జాబితాను విడుదల చేశారు. కష్టపడి చదివిన వారు ఉద్యోగాలు సాధించారు. మెరిట్ జాబితాను డీఎస్సీ అధికారిక వెబ్‌సైట్లో పెట్టారు. అన్ని సబ్జెక్టులకు రాష్ట్ర, జోన్, జిల్లాల వారీగా ర్యాంకులు ఇచ్చారు. జిల్లాలో 53,787 మంది అభ్యర్థులు డీఎస్సీ రాశారు. వారికి వచ్చిన మార్కులు ఆధారంగా మెరిట్ జాబితాను విడుదల చేశారు. త్వరలో పాఠశాలలకు కొత్త గురువు వస్తున్నారు. వివిధ సబ్జెక్టుల వారీగా వచ్చిన మార్కులు పరిశీలిస్తే జిల్లాలో టాపర్-1గా నిలిచిన అభ్యర్థులు అత్యధికంగా 64.22 - 87.34 మార్కులు సాధించారు. ఆఖరులో నిలిచిన అభ్యర్థులకు అత్యల్పంగా సాంఘిక శాస్త్రంలో 18.56 మార్కులు, స్కూల్ అసిస్టెంట్ కన్నడలో 43.27 మార్కులు వచ్చాయి. వివిధ కేటగిరి రిజర్వేషన్లు ప్రకారం స్థానిక (లోకల్) అభ్యర్థులకు కటాఫ్ మార్కులు 64.06395 నుంచి 79.60427 పైబడి మార్కులు వచ్చిన అభ్యర్థులకు, స్థానికేతర (నాన్ లోకల్) అభ్యర్థులు 70.56513 నుంచి 87.00531 మార్కులకు పైగా వచ్చిన అభ్యర్థుకు ఉపాధ్యాయ ఉద్యోగాలు వచ్చే అవకాశం ఉంది. మెరిట్ జాబితాలో పేర్లు, మార్కులు, ర్యాంకులు చూసి తమకు ఉద్యోగం ఖాయం అని భావించే అభ్యర్థులు, వారి ఇళ్లలో సంబరాలు జరుపుకుంటున్నారు.

మిగతా 5వ పేజీలో

ఉమ్మడి కర్నూలు జిల్లాలో డీఎస్సీ-2025లో వివిధ విభాగాల్లో జిల్లా టాపర్-1, 2 విజేతలు, వారికి వచ్చిన మార్కులు

విభాగం	టాపర్-1	మార్కులు	టాపర్-2	మార్కులు
స్కూల్ అసిస్టెంట్ (లాంగ్వేజ్)				
ఇంగ్లీష్	ఆర్. సాయినవీన్	85.89	కోనంగి రమేష్‌బాబు	85.19
హిందీ	నసీరుద్దీన్ ముల్లా	82.37	ఎస్.సుశీల	80.50
కన్నడ	బాలకుండి మాకన్న	78.57	వడ్డె నాగరాజ	74.33
సంస్కృతం	కల్లూరు జమల్	67.13	బి.శ్రీహరికృష్ణ	60.57
తెలుగు	కల్లె మహేశ్‌బాబు	85.62	మధుసూదన్ అంగజల	84.40
ఉర్దూ	సబిహా బేగం	85.13	ఇస్మాయిల్ బాషా	85.00
స్కూల్ అసిస్టెంట్ (నాన్ లాంగ్వేజ్)				
బయోలాజికల్ సైన్స్	వడుగూరు నాగరాజు	85.67	బాలస్వామి నందల	85.62
కన్నడ మీడియం	పూజారి చాముండి	68.80	అంబికా ఆర్	65.80
ఉర్దూ మీడియం	ఎం. మహ్మద్ ఫయాజ్	74.37	బీఎస్ తబస్సుమ్	73.00
లెక్కలు	వి.వెంకటరామిరెడ్డి	85.18	జంగం జ్యోతిరాంప్రసాద్	84.43
కన్నడ మీడియం	కురువ శివశంకర్	72.60	డ్యాన్ హెచ్‌డీ	63.33
ఉర్దూ మీడియం	షేక్ అఫిజాబీ	64.22	కలగట్ల గయాబ్‌వలి	64.13
ఫిజికల్ సైన్సు	వెంకటశివారెడ్డి	81.04	బి.వెంకట చిరంజీవి	79.27
కన్నడ మీడియం	భీమప్ప	66.40	కురువ శివశంకర్	59.60
సోషియల్ స్టడీస్	చాకలి పరుశరాముడు	87.34	గొల్ల కోదండరాముడు	86.07
కన్నడ మీడియం	తలురు స్వాతి	70.83	మాన్వి హనుమంత	61.47
ఉర్దూ	బండెగేరి బషిరున్	69.23	షేక్ మోమినా	67.40
సెకండరీ గ్రేడ్ టీచర్స్ (ఎస్‌జీటీ)				
ఎస్‌జీటీ	బొల్లం లావణ్య	94.53	కమలపాడు శారద	93.27
కన్నడ మీడియం	మూలెమనె నస్నేఖాశీం	73.93	రౌడూరు ఇస్మాయిల్	71.60
ఉర్దూ మీడియం	షేక్ రోష్ని	78.03	షేక్ జంరుద్‌బీ	77.57
టీజీటీ ఇంగ్లీష్	కాలహస్త్రి గౌతమి	83.32	షేక్ సమీర్‌బాషా	82.98

ఇంద్రాణికి ర్యాంకుల పంట



నంద్యాల పట్టణం సంజీవనగర్‌కు చెందిన ఇంద్రాణి మొదటి సారిగా రాసిన డీఎస్సీలో మంచి ర్యాంకులు సాధించింది. మహానంది దేవస్థానంలో సహాయ పూజారిగా పనిచేస్తున్న సూర్యనారాయణ, సరస్వతమ్మ కూతురు ఇంద్రాణి. ఎస్ఏ మ్యాథ్స్‌లో జిల్లాస్థాయిలో 3వ ర్యాంక్ సాధించగా, టీజీటీ మ్యాథ్స్‌లో జోన్‌స్థాయిలో 5వ ర్యాంక్, జిల్లాస్థాయిలో 2వ ర్యాంక్ సాధించారు. టీజీటీ సైన్స్‌లో జోన్‌స్థాయిలో 29వ ర్యాంక్, రాష్ట్రస్థాయిలో 73వ ర్యాంక్ సాధించారు. తన తల్లి ఎస్జీటీ ఉపాధ్యాయురాలు కావడం కలిసి వచ్చిందన్నారు.

కూలీ నుంచి గురువుగా..



మహానంది మండలం ఎం.తిమ్మాపురం గ్రామానికి చెందిన శ్రీనివాసులు అరటి గెలలు మోసే కూలీస్థాయి నుంచి ఉపాధ్యాయుడిగా విజయం సాధించారు. డీఎస్సీ మెరిట్ లిస్ట్‌లో జిల్లాస్థాయిలో సోషల్ విభాగంలో 13వ ర్యాంక్ దక్కింది. అరటిగెలలు మోస్తూ వచ్చిన కూలీ డబ్బులతో చదువును కొనసాగించారు. బీఈడీ పూర్తి చేసిన తర్వాత ప్రైవేట్ పాఠశాలల్లో పనిచేస్తూనే డీఎస్సీ పరీక్ష రాస్తూ వచ్చారు. బీఈడీ పూర్తి చేసిన తర్వాత ప్రైవేట్ పాఠశాలల్లో పనిచేస్తూనే డీఎస్సీ పరీక్ష రాస్తూ వచ్చారు. ఈసారి గురి తప్పలేదని, ఉద్యోగం వచ్చింది.

భక్తులతో కిటకిటలాడిన మల్లన్న క్షేత్రం



దర్శనం కోసం క్యూలైన్లలో వెళ్తున్న భక్తులు

నంద్యాల కల్చరల్, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): శ్రీశైల మల్లన్న క్షేత్రం శనివారం భక్తులతో కిటకిటలాడింది. తెలుగు రాష్ట్రాల నుంచే కాక ఉత్తర, దక్షిణాది రాష్ట్రాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. పాతాళగంగలో పుణ్యస్నానాలు ఆచరించి తర్వాత స్వామి వారిని దర్శించుకున్నారు. భక్తుల రద్దీ ఎక్కువగా ఉండడంతో దర్శనానికి రెండు గంటలపైగా సమయం పట్టినట్లు ఆలయ అధికారులు తెలిపారు. భక్తుల శివనామ స్మరణతో క్షేత్ర పరిసరాలు మార్మోగాయి. ఆలయ దర్శనాలు ప్రారంభమై ముగిసేంత వరకు భక్తు లకు ఉచిత ప్రసాద వితరణ చేశారు. అలాగే తాగునీటి సౌకర్యం కల్పించారు.

ఘనంగా టంగుటూరి జయంతి



టంగుటూరి ప్రకాశం పంతులు చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న ఎస్పీ, పోలీసులు

నంద్యాల టౌన్, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): జిల్లా పోలీసు కార్యాలయంలో టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ ఆంధ్రరాష్ట్రానికి మొదటి ముఖ్యమంత్రిగా ఎన్నో సేవలు అందించారని గుర్తు చేశారు. నిరుపేద కుటుంబంలో పుట్టి ఎన్నో విజయాలు అందుకున్నారని నాయకుడిగా, రచయితగా, విశేష ప్రతిభాశాలిగా కీర్తి గడించారని కొనియాడారు. యువత ఆయనను స్ఫూర్తిగా తీసుకుని మంచి మార్గంలో నడవాలని కోరారు. ఏఎస్పీ యుగంధర్ బాబు, ఎస్పీ డీఎస్పీ శ్రీనివాసరెడ్డి, సీఐలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

నకిలీ ఇళ్ల పట్టాలు స్వాధీనం

కొలిమిగుండ్ల, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): మండలానికి సంబంధించిన నకిలీ ఇళ్ల పట్టాలను పోలీసులు పెద్ద ఎత్తున స్వాధీనం చేసుకున్నారు. అవుకు మండలానికి చెందిన ఓ వ్యక్తి నకిలీ ఇళ్ల పట్టాలు సృష్టించి, ఇంటి స్థలాలు విక్రయిస్తున్నాడన్న సమాచారంతో సదరు వ్యక్తి ఇంట్లో అవుకు పోలీసులు సోదాలు నిర్వహించారు. పెద్ద ఎత్తున నకిలీ పట్టాలు బయటపడినట్లు తెలుస్తోంది. కాగా ఆ పట్టాలు కొలిమిగుండ్ల మండలం కొలిమిగుండ్ల, ఇటి క్యాల రెవిన్యూ పరిధిలోవి కావడంతో పోలీసులు విచారణ నిమిత్తం వాటిని కొలిమిగుండ్ల తహసీల్దార్ కార్యాలయంలో కార్యాలయంలో అప్పగించినట్లు సమాచారం. కాగా కొంత కాలంగా కొందరు దళారులు ముఠాగా ఏర్పడి ఖాళీగా ఉన్న ప్రభుత్వ స్థలాలకు నకిలీ అనుబంధ పట్టాలు తయారుచేసి విక్రయిస్తున్నారని చర్చ జోరుగా నడుస్తోంది. వీరికి కొంతమంది రెవెన్యూ అధికారుల అండ ఉన్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇప్పటికే కొలిమిగుండ్ల, అవుకు మండలాలకు చెందిన పలువురికి ఇలా నకిలీ డాక్యుమెంట్లతో ఇళ్ల స్థలాలు విక్రయించినట్లు తెలుస్తోంది. అధికారులు సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. కొలిమిగుండ్ల తహసీల్దార్ శ్రీనివాసులును వివరణ కోరగా అవుకు పోలీసులు ఓ వ్యక్తి నుంచి స్వాధీనం చేసుకున్న 80 అనుబంధ ఇళ్ల పట్టాలను నకిలీవిగా అనుమానిస్తూ తమకు అందజేశారని చెప్పారు. వీటిపై సమగ్ర విచారణ చేసి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని చెప్పారు.

తప్పులు లేని ఓటర్ల జాబితా రూపొందించాలి



మాట్లాడుతున్న డీఆర్వో రామునాయక్

నంద్యాల ఎడ్యుకేషన్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో తప్పులు లేని ఓటర్ల జాబితాను రూపొందించాలని డీఆర్వో రాము నాయక్ కోరారు. శనివారం జిల్లా రెవెన్యూ అధికారి కార్యాలయంలో గుర్తింపు పొందిన అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులతో డీఆర్వో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటర్ల జాబితాలో మార్పులు, చేర్పులు ఉంటే ఈఆర్వో, ఏఆర్వోలకు తెలియజేయాలన్నారు. రాజకీయ పార్టీలు సూచించిన అంశాలను ఎన్నికల సంఘానికి నివేదిస్తామన్నారు. అనంతరం రాజకీయ పార్టీల ప్రతినిధులు మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల్లో బ్యాలెట్ ఓటింగ్ బదులు ఈవీఎం ఓటింగ్ శాతం ఎక్కువగా జరిగిందని, బ్యాలెట్ ఓటింగ్‌ను ఏర్పాటు చేయాలని కోరారు. నంద్యాల మండలం పాండురంగాపురానికి ప్రత్యేక పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని కోరారు.

ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలి

కలెక్టర్ రాజకుమారి



స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్రలో పాల్గొన్న కలెక్టర్ రాజకుమారి

నంద్యాల ఎడ్యుకేషన్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్యకరమైన జీవన విధానం - పర్యావరణ పరిరక్షలో భాగంగా ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలని కలెక్టర్ రాజకుమారి గణియా కోరారు. స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం కలెక్టర్ కార్యాలయ ఆవరణలో ఉద్యోగులు చేపట్టిన పరిసరాల పరిశుభ్రత కార్యక్రమంలో జేసీ విష్ణుచరణ్‌తో కలిసి కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామస్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు ప్లాస్టిక్ కవర్ల స్థానంలో కాటన్, జూట్ బ్యాగులను ఉపయోగించేలా ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. అధిక వర్షాల కారణంగా నీటి నిల్వలు ఉండడం వల్ల డయేరియా ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని, ప్రతి శుక్రవారం డ్రైడే పాటించేలా ప్రజలకు అవగాహన కల్పించాలని కలెక్టర్ ఆదేశించారు.

శ్రీశైలంలో మాక్ డ్రిల్

డ్యాం పరిసర ప్రాంతాల్లో నిర్వహించిన ఆక్టోపస్ బృందం



మాక్ డ్రిల్ నిర్వహిస్తున్న ఆక్టోపస్ బృందం

నంద్యాల కల్చరల్(శ్రీశైలం), ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): శ్రీశైలం డ్యామ్ వ్యూ పాయింట్ నుంచి డ్యాం వరకు ఆయా పరిసర ప్రాంతాల్లో ఆక్టోపస్ యాంటీ టెర్రరిస్ట్ స్క్వాడ్ టీమ్ అత్యాధునిక ఆయుధాలతో శనివారం రాత్రి మాక్ డ్రిల్ నిర్వహించింది. రాత్రి సమయంలో విద్యుత్ సరఫరా నిలిపివేసి చిమ్మ చీకటిలో దట్టమైన కొండల నడుమ ఉన్న శ్రీశైలం డ్యామ్‌పై ఆక్టోపస్ పోలీసు బలగాలు మాక్ డ్రిల్ నిర్వహించాయి. ఆక్టోపస్ ఏపీ మంగళగిరి డీఎస్పీ రంగబాబు ఆధ్వర్యంలో 38 మంది ఆక్టోపస్ టీమ్ సభ్యులు పాల్గొన్నారు. శ్రీశైలం డ్యామ్ భద్రత, తీవ్రవాదుల కదలికలు గమనిస్తూ అనుకోకుండా డ్యామ్‌పై చొరబడితే వారి చెర నుంచి అధికారులను, వ్యక్తులను ఎలా కాపాడుకోవాలనే అంశంపై రెక్కీ నిర్వహించారు. తీవ్రవాదుల చర్యలను ఎలా తిప్పికొటాలి? అత్యాధునిక ఆయుధాలతో చాకచక్యంగా ఉగ్రవాదులను ఎలా ముట్టు పెట్టాలి? వారి నుంచి ఎలా బయటపడాలి? అనే ప్రక్రియపై మాక్ డ్రిల్ నిర్వహించారు. కొండలు, గుట్టలు దిగుతూ చీకట్లో అర్ధరాత్రి వరకు ఆక్టోపస్ పోలీసు బలగాలు మాక్‌డ్రిల్ నిర్వహించగా శ్రీశైలం డ్యామ్ పరిసరాలు మొత్తం చీకటి, నిశబ్దమైన వాతావరణం నెలకొంది. కార్యక్రమంలో ఆత్మకూరు డీఎస్పీ రామాంజినాయక్, శ్రీశైలం పోలీసులు, డ్యాం ఎస్పీఎఫ్ ఆర్ఐ రాజేష్, నీటిపారుదల, అగ్నిమాపక తదితర శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా అంజన్న రథోత్సవం

- భారీగా తరలివచ్చిన భక్తులు



రణ మండల ఆంజనేయ స్వామి రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

ఆదోని అగ్రికల్చర్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి) : శ్రావణమాసాన్ని పురస్కరించుకుని పట్టణ శివారులోని కొండల్లో వెలసిన రణ మండల ఆంజనేయ స్వామి రథోత్సవం శనివారం వైభవంగా జరిగింది. 30 రోజులపాటు రణ మండల కొండల్లో ఆంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు జరిగాయి. ఉదయం సింధూర సేవ, అలంకరణ, మహా మంగళహారతి పూజలు నిర్వహించారు. సాయంత్రం ఆంజనేయుడి భారీ రథోత్సవాన్ని ఆలయ కమిటీ చైర్మన్ టీజీ పాండురంగ, విశ్వహిందూ పరిషత్ జిల్లా అధ్యక్షుడు బసవన్న గౌడ్, ఎగ్గాటి ప్రతాప్, దేవిశెట్టి ప్రకాష్, నీలకంఠ, నాగరాజు గౌడ్, మారుతీరావు ప్రారంభించారు. రథోత్సవం పట్టణంలోని సాయిబాబా విగ్రహం నుంచి టూటౌన్ పోలీస్ స్టేషన్ మీదుగా భీమా సర్కిల్, శ్రీనివాస్ భవన్ నుంచి తిరిగి సాయిబాబా గుడికి చేరుకుంది. అంజనేయుడి మాలధారణ స్వాములు హనుమాన్ నామస్మ రణంతో ముందుకు సాగారు.

విద్యార్థి బలవన్మరణం

- ఆరోగ్యం బాగాలేదని తల్లిదండ్రులకు మెసేజ్



భానుప్రకాశ్ (ఫైల్)

నంద్యాల టౌన్, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): ఓ ఇంజనీరింగ్ విద్యార్థి ఫ్యాన్‌కు ఉరేసుకొని బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ ఘటన నంద్యాల సమీపంలోని పాణ్యం మండలం ఆర్జీఎం కళాశాల వసతిగృహంలో చోటుచేసుకున్నట్లు ఏఎస్పీ మందా జావళి తెలిపారు. వివరాలు.. కడప జిల్లా లింగాల మండలం తాతిరెడ్డి పల్లెకు చెందిన సరస్వతి, రాంభూపాల్ దంపతుల కుమారుడు భానుప్రకాశ్(19). పాణ్యంలోని ఆర్జీఎం కళాశాలలో ఈసీఈ సెకండియర్ చదువుతున్నాడు. శనివారం కళాశాల వసతి గృహంలో తోటి విద్యార్థులందరూ కాలేజీకి వెళ్లిన తర్వాత ఎవరూ లేని సమయంలో టవల్‌తో ఫ్యాన్‌కు ఉరేసుకున్నాడు. శుక్రవారం రాత్రి తల్లిదండ్రులకు ఆరోగ్యం సరిగా లేదని మెసేజ్ కూడా పంపాడు. తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్పీ తెలిపారు.

జై హనుమా..



ఆంజనేయస్వామికి ప్రత్యేక అలంకరణ గావించిన దృశ్యం

ఆత్మకూరు పట్టణంలోని పాతబస్టాండ్ సమీపంలో గల ఆత్మలింగేశ్వర స్వామి ఆలయం వద్ద వెలసిన అభయాంజనేయ స్వామికి శనివారం ప్రత్యేక పూజలు జరిగాయి. అమావాస్య కావడంతో భక్తులు భారీగా తరలివచ్చారు. ఆలయ అర్చకులు అనిల్‌కుమార్ శర్మ ఉదయం నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు.
- ఆత్మకూరు రూరల్ (ఆంధ్రజ్యోతి)

తుంగభద్ర తీరం

సాహిత్యం

రాయలసీమ గ్రామీణ జీవిత అస్తిత్వ యుద్ధమే నడూరి మిద్దె



కర్నూలు కల్చరల్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): రాయలసీమ ప్రాంతంలోని గ్రామీణ జీవిత అస్తిత్వ యుద్ధమే 'నడూరి మిద్దె' నవల అనిపిస్తుంది. మిద్దెలేని ఇల్లు, మిద్దె లేని మనిషి ఊరులో లేనివాడిలా... మిద్దె ఉన్న వారికే ఊరిలో గౌరవం అని భావించే అనేక గ్రామాల్లోని భావనను రచయిత చక్కగా ఈ నవల్లో చిత్రీకరించారు. కర్నూలుకు చెందిన సురేంద్ర శీలం తక్కువ రచనలే చేసినా, పాఠకుల హృదయాలకు హత్తుకుపోయేలా రాశారు. ప్రస్తుతం సినీ పరిశ్రమలో అసిస్టెంట్ దర్శకునిగా పనిచేస్తున్న ఆయన సామాజిక సమస్యలకు దగ్గరగా రచనలు చేస్తున్నారు. ఆయన రచనల్లో కనిపించే మట్టి వాసన, పల్లె మనుషుల మానసికత పరిస్థితి, అణగారిన వర్గాల ఆవేదన, అన్నీ ఆయన స్వయంగా చూసిన జీవనానుభావాల ప్రతిబింబంగా ఈ పుస్తకం నిలుస్తుంది. సీమలో రాత్రిపూట మామిడితోటల్లో కూర్చుని విన్న కబుర్ల నుంచి గంగిరెద్దు ఆటగాళ్ల పాటల్లోంచి, కరువులో ఎండిపోయిన పొలాల నుంచి ఆయన తన కలాన్ని నడిపించారు. నడూరి మిద్దె (నడిఊరిలోని మిద్దె)లో ఒక జీవిత పోరాటం దాగుంది. రాయలసీమ బతుకు బాట, అగాధ దౌర్భాగ్యం, అంతరంగ గౌరవ పోరాటాన్ని గుర్తు చేస్తుంది. మిద్దె అంటే ఇంటికి ఉండే పై కప్పు పొడిగింపు. కానీ ఈ నవల్లో అది కేవలం నిర్మాణం కాదు. పల్లె మనిషి గౌరవం. ఊరిలో మనిషి స్థానం. ఇల్లు సామాజిక అంగీకారం. సిన్నోడు అనే పాత్ర ఈ నవల్లో మనకెదురు అవుతుంది. మిద్దె లేకపోతే అతను ఊరు నుంచీ వెళ్లిపోవాల్సిన పరిస్థితిని భార్య కల్పిస్తుంది. రచయిత ఈ బలహీనతను, ఆవేదనను ఎంత సహజంగా రాశారో చదివే పాఠకులకు హత్తుకుంటుంది. శాంతి పాత్ర కలల్లో బతికే మనిషిలా నిలుస్తుంది. ఆమె తన బిడ్డను మిద్దెలో పెంచాలన్న ఆరాటం, అదే క్రమంలో సిన్నోడు పాత్ర ఆత్మగౌరవం కోసం పోరాడే సాధారణ మనిషి. పెద్దిరెడ్డి, నారాయణరెడ్డి వంటి పాత్రలు ఊర్లోని శక్తికి, ఆధిపత్యానికి ప్రతీకలుగా కనిపిస్తాయి. రచయిత సురేంద్ర రాయలసీమ ఉచ్చారణతో గట్టిగా పలికే పదాలతో, బరువైన వాక్యాలతో నవలను నడిపించారు. ఈ నవల ప్రధానంగా కనిపించే అంశం గౌరవం కోసం మనిషి చేసే పోరాటంగా చెప్పవచ్చు. ఇది ఒక పుస్తకం మాత్రమే కాదు. రాయలసీమ పల్లె జీవన గీతం. పల్లెల్లో ప్రతి ఇల్లు, ప్రతి మానవ సంబంధం, ప్రతి గౌరవం అన్నీ ఈ మిద్దెల్లో కొట్టుమిట్టాడుతున్నాయి. మిద్దె అనేది సాధారణ పదంగానే అనిపించవచ్చు, కానీ పల్లె ప్రజలకు మాత్రం అదే గౌరవంగా, అస్తిత్వంగా, మనిషికి బతుకుబాటగా నిలుస్తుంది.



- ఆరుద్ర ఈశ్వర్, సాహితీ విమర్శకుడు, కర్నూలు

నడిచే నిఘంటువు.. కేసీ కల్కూర..!



కర్నూలు కల్చరల్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): ధవళ వర్ణపు వదులైన ఖద్దరు చొక్కా, అంచుతో కూడిన తెల్లని పంచెకట్టు, మెడపై కాంగ్రెసు కండువాతో, భుజానికి కాగితాల సంచి తగిలించుకొని కనిపించే ఆయన నిండైన విగ్రహాన్ని వేలమందిలో ఉన్నా ఇట్టే పోల్చుకుంటారు. 'వందేమాతరం' అంటూ ఆయన తన ఉపన్యాసం ప్రసంగించే ముందూ, ప్రసంగం ముగింపులోనూ చేసే జాతీయతా నినాదం మనలోనూ దేశభక్తి భావనను ఉప్పొంగిస్తుంది. సాహిత్యమైనా, చరిత్ర అయినా, సామాజిక అంశాలైనా, ఆధునిక విజ్ఞాన విషయాలైనా ఆయనను అడిగిందే తడవుగా ఉదాహరణలతో సహా ఇట్టే చెప్పేస్తారు. అంతేకాదు, అందుకు పలు అంశాలను కూడా జోడించి మనకు అదనపు సమాచారం కూడా అందజేస్తారు. అందుకే ఆయన్ను అందరూ 'నడిచే నిఘంటువు' అని అంటారు. ఉమ్మడి కర్నూలు జిల్లావాసులకు సుపరిచితమైన ఆ పేరే కురాడి చంద్రశేఖర కల్కూర. అలియాస్ కేసీ కల్కూర. ఒకప్పుడు హోటల్‌లో సప్లయర్ బాయ్‌గా మొదలైన ఆయన జీవిత ప్రస్థానం అనంతర కాలంలో మూడు హోటళ్లకు యజమానిగా చేసింది. సాహిత్యం, సామాజిక సేవా రంగాల్లో అనేక పురస్కారాలు ఆయన్ను వెతుక్కుంటూ వచ్చి వరించాయి.

సాహిత్యం, చరిత్ర పరిశోధన, సామాజిక సేవల్లో గుర్తింపు

కర్ణాటక రాష్ట్రంలోని ఉడిపి జిల్లా, కురాడి గ్రామంలో వ్యవసాయ రైతు కుటుంబంలో 20 జూన్ 1940లో కేసీ కల్కూర జన్మించారు. తల్లిదండ్రులు లక్ష్మీదేవమ్మ, నారాయణ కల్కూర వ్యవసాయం చేస్తూనే కుటుంబాన్ని పోషించారు. ఐదుగురు అన్నదమ్ములు, ఇద్దరు అక్కచెల్లెళ్ల మధ్య పుట్టిన కేసీ కల్కూర స్వగ్రామంలోనే ప్రాథమిక విద్య చదువుకున్నారు. 1957లో ఎస్ఎస్ఎల్‌సీ పూర్తి చేసి, బతుకుదెరువు నిమిత్తం అప్పటికే నంద్యాలలోని ఉడిపి కాఫీ బార్‌లో పనిచేస్తున్న అన్నతోపాటూ తాను సప్లయ్ బాయ్‌గా పనిలో చేరాడు. తిరిగి ఉడిపి వెళ్లి 1962లో పీయూసీ పాసై, కర్నూలు ఉస్మానియా కళాశాల్లో 1965లో డిగ్రీ పూర్తి చేశారు. బెంగుళూరు ప్రభుత్వ న్యాయ కళాశాల్లో లా డిగ్రీలో చేరి, 1968లో న్యాయవిద్య పూర్తి చేశాడు. అనంతరం తిరిగి కర్నూలు చేరుకొని 1972 వరకు లాయర్‌గా ప్రాక్టీస్ చేశాడు. ఇదే సమయంలో కర్ణాటక రాష్ట్రంలోని శివమొగ్గ నివాసి ప్రభావతమ్మతో 1970 మార్చి 25న వివాహం జరిగింది. అయితే హోటల్ మేనేజ్‌మెంట్‌పై ఆసక్తి ఉన్న ఆయన తిరిగి హోటల్ రంగంలోనికి ప్రవేశించి, 1975లో ఆదోనిలో తన ఇంటి పేరుతోనే కల్కూర హోటల్ ప్రారంభించారు. తర్వాత 1976లో కర్నూలులో పాతబస్టాండు సమీపంలో, 1979లో జడ్పీరోడ్డులో మరో హోటల్ తెరిచారు. హోటల్ మేనేజ్‌మెంట్‌లో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. హోటల్స్ ఓనర్స్ అసోసియేషన్‌లో ఈసీ మెంబర్‌గా, ఉపాధ్యక్షులుగా, కార్యదర్శిగా పనిచేసి, రాష్ట్ర అధ్యక్షులుగానూ కొనసాగారు. అప్పటి ముఖ్యమంత్రులు పీవీ నరసింహారావు, మర్రి చెన్నారెడ్డి, జలగం వెంగళరావు, టి. అంజయ్య, భవనం వెంకట్రామ్, కోట్ల విజయభాస్కర్‌రెడ్డి, ఎన్.జనార్ధన్‌రెడ్డి, వైఎస్ రాజశేఖరరెడ్డిలకు ఆయన ఆతిథ్యం ఇచ్చారు. ముఖ్యంగా నాటి ముఖ్యమంత్రి, కేంద్ర మంత్రి కోట్ల విజయభాస్కర్ రెడ్డితో ఉన్న అనుబంధంతో కేసీ కల్కూర 1985లో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులుగా కొనసాగారు. అలాగే 1992 నుంచి 1995 వరకు జిల్లా కేంద్ర గ్రంథాలయ సంస్థ ఛైర్మన్‌గా పదవీబాధ్యతలు నిర్వహించారు.



ఆదోని కోట చరిత్రను అధ్యయనం చేస్తున్న కల్కూర

సాహిత్యంలో అభినివేశం.. నిత్య పుస్తక పఠనం

విద్యార్థి దశ నుంచి పుస్తకాలు చదవడం అలవాటు ఉన్న కేసీ కల్కూర తొలుత కన్నడ సాహిత్యానికి సంబంధించిన అనేక పుస్తకాలు చదివారు. డిగ్రీ చదివే రోజుల్లో ఉస్మానియా కళాశాల తెలుగు అధ్యాపకుడు గౌరీశ్వర్ తెలుగు భాషకు సంబంధించిన అనేక పుస్తకాలను చదవమని ప్రోత్సహించారు. బెంగుళూరులో ఆంగ్ల సాహిత్యాలను అధ్యయనం చేశారు. ఇలా మూడు భాషల్లో వేలాది పుస్తకాలు చదివారు. 1997లో గాడిచర్ల ఫౌండేషన్ సంస్థను స్థాపించి గ్రంథాలయ ఉద్యమ కార్యక్రమాలను చేపట్టారు. 2000 సంవత్సరంలో సాహితీ సదస్సునకు అధ్యక్షులుగా ఎన్నికయ్యాక ప్రతినెలా సదస్సు ద్వారా అనేక కార్యక్రమాలు కొనసాగిస్తున్నారు. పుస్తక పఠనం ఒక అలవాటుగా చేసుకున్న కేసీ కల్కూర నిత్యం నాలుగు గంటల పాటూ పుస్తక పఠనానికి కేటాయిస్తారు. ఆయన భద్రపరచిన 2వేలకు పైగా ఎన్నో గొప్ప పుస్తకాలు 2009 నాటి తుంగభద్ర వరదల్లో ధ్వంసమయ్యాయి. తిరిగి సుమారు 3వేల పుస్తకాలను తన ఇంటి గ్రంథాలయంలో భద్రపరచుకున్నారు. అలాగే అనేక సంవత్సరాలుగా తాను రాసి, హిందు దినపత్రికలో ముద్రితమైన లేఖలను 2001లో ఒక పుస్తకరూపంలో తీసుకువచ్చారు. 'గార్లండ్ ఆఫ్ లెటర్స్' పేరుతో ఈ పుస్తకంలో అనేక సామాజిక అంశాలను ఆయన ప్రస్తావించారు. జిల్లాతో ఉన్న తన అనుబంధాన్ని, జిల్లా చరిత్రకు సంబంధించిన అనేక అంశాలను 'అమ్మ ఒడిలో' అనే ఆత్మకథ ద్వారా ముందుకు తీసుకురానున్నారు. తుంగభద్ర నది పుట్టుక చరిత్రపై కూడా పరిశోధనాత్మక గ్రంథాన్ని త్వరలో పూర్తి చేయనున్నారు.

పురస్కారాలు ఎన్నో...

- శ్రీకృష్ణ సేవానుగ్రహ ప్రశస్తి (1992, 2007 సంవత్సరాల్లో)
- కల్లూరు సుబ్బరావు పురస్కారం (2005) కళాజ్యోతి.
- ధర్మవరం, అనంతపురం జిల్లాల నుంచి, విజయ విఠల ప్రశస్తి.
- 2008 మంత్రాలయం శ్రీరాఘవేంద్రస్వామి మఠం వారి నుంచి.
- అయ్యంకి వెంకటరమణయ్య గ్రంథాలయ కీర్తి పురస్కారం.
- 2010 శ్రీపొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం హైదరాబాద్ వారి నుంచి ప్రతిభా పురస్కారం.
- 2010 కర్నూలు యునైటెడ్ క్లబ్ వారి సేవా పురస్కారం.
- 2015లో రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా ఉగాది పురస్కారం.





ముఖ్యమంత్రి చంద్రబాబు చేతుల మీదుగా ఉగాది పురస్కారం అందుకుంటూ..

ఇంట్లో గ్రంథపఠనం చేస్తూ..

సురవరం సుధాకర్‌రెడ్డికి సీపీఐ సంతాపం

కర్నూలు కల్చరల్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) అగ్రనాయకుడు, సీపీఐ పూర్వ జాతీయ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర్‌రెడ్డి మృతిపై ఆ పార్టీ జిల్లా సమితి నాయకులు శనివారం ఒక ప్రకటనలో సంతాపం తెలిపారు. సురవరం సుధాకర్‌రెడ్డి అనారోగ్యంతో మృతి చెందడం దేశంలో కమ్యూనిస్టు ఉద్యమానికి, కార్మిక, కర్షకులు, కష్టజీవులకు తీరని లోటని జిల్లా కార్యదర్శి బి. గిడ్డయ్య పేర్కొన్నారు. వారి కుటుంబ సభ్యులకు జిల్లా సమితి తరపున ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు. సురవరం సుధాకర్‌రెడ్డికి బాల్యం నుంచి కర్నూలు జిల్లాతో ఎనలేని అనుబంధం ఉందన్నారు. ఏఐఎస్ఎఫ్ పట్టణ కార్యదర్శిగా, జిల్లా కార్యదర్శిగా, జాతీయ స్థాయిలో విద్యార్థి, యువజన సంఘాల ప్రధాన కార్యదర్శిగా పనిచేశారని తెలిపారు. 1994లో నాటి జిల్లాలోని డోన్ అసెంబ్లీ స్థానానికి నాటి ముఖ్యమంత్రి కోట్ల విజయభాస్కరరెడ్డిపై పోటీ చేశారన్నారు. మొగలవల్లి గ్రామంలో జరిగిన భూ పోరాటానికి నాయకత్వం వహించి 1100ఎకరాల మిగులు భూములను పేదలకు పంపిణీ చేసిన చరిత్ర ఆయనకే దక్కుతుందన్నారు.

విద్యార్థులు టంగుటూరి గురించి తెలుసుకోవాలి

- కేవీఆర్ కళాశాలలో 153వ జయంతి

కర్నూలు అర్బన్, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు టంగుటూరి ప్రకాశం పంతులు చరిత్ర తెలుసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆంధ్రప్రదేశ్ చరిత్ర కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి, లయోలా కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ముచ్చా శ్రీనివాసరెడ్డి అన్నారు. శనివారం కేవీఆర్ మహిళా డిగ్రీ కళాశాలలో సాహితీ సదస్సు ఆధ్వర్యంలో ప్రకాశం పంతులు 153వ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకాశం పంతులు రాజకీయ జీవితం రాజమండ్రి మున్సిపల్ కౌన్సిలర్‌గా ప్రారంభమైందన్నారు. ఆయన ఎక్కడ పనిచేసినా పేద ప్రజల కోసం పరితపించే వారని, అలాంటి నాయకుడు మన తెలుగు వాడు కావడం హర్షించదగ్గ విషయమన్నారు. కురాడి చంద్రశేఖర్ కల్కూర మాట్లాడుతూ ప్రజల కోసం సర్వం త్యాగంచేసిన మహనీయుడు ఆంధ్రకేసరి అని, అలాంటి మహనీయుడి విగ్రహం కర్నూల్లో ఏర్పాటు చేయాలన్నారు. క్లస్టర్ యూనివర్సిటీ డీన్ అక్తర్‌భాను మాట్లాడుతూ విద్యార్థులు ప్రకాశం పంతులు జీవితాన్ని స్ఫూర్తిగా తీసుకుని ముందుకు సాగాలన్నారు. మానవ శక్తి పరిశోధన కేంద్ర వ్యవస్థాపకుడు డాక్టర్ మన్సూర్ రెహమాన్ మాట్లాడుతూ ధైర్యానికి మారుపేరు సింహం అయితే ఆంధ్ర సింహం ప్రకాశం పంతులని కొనియాడారు. అనంతరం క్విజ్ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు నగదు బహుమతులు, మెమెంటోలు, సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో జేఎస్ఆర్‌కే శర్మ, గంగాధర్‌రెడ్డి, మనోహర్, పూర్వ విద్యార్థిని సుబ్బలక్ష్మి, డి.పార్వతి, చరిత్ర అధ్యాపకురాలు తదితరులు పాల్గొన్నారు.



నివాళి అర్పిస్తున్న వైస్ ప్రిన్సిపాల్ ముచ్చా శ్రీనివాసరెడ్డి తదితరులు

ఖైదీలు సత్ప్రవర్తన అలవర్చుకోవాలి

జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి లీలా వెంకటశేషాద్రి



రికార్డులను తనిఖీ చేస్తున్న లీలా వెంకటశేషాద్రి

కర్నూలు లీగల్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): ఖైదీలు సత్ప్రవర్తనను అలవర్చుకోవాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.లీలా వెంకటశేషాద్రి సూచించారు. శనివారం స్థానిక మహిళా జైలును ఆయన అకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఖైదీలు తమ కుటుంబాన్ని, భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని నేర స్వభావాన్ని విడిచి మంచి పౌరులుగా మారాలని కోరారు. అనంతరం మహిళా చట్టాల గురించి ఖైదీలకు వివరించారు. అనంతరం ఖైదీలకు అందిస్తున్న భోజన, వసతి సౌకర్యాల గురించి అడిగి తెలుసుకున్నారు. ఖైదీల గదులు, వంటశాల, రికార్డులను తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో లీగల్ ఎయిడ్ న్యాయవాది సులోచన తదితరులు పాల్గొన్నారు.

అమ్మ పేరుతో ఓ మొక్క

- మొక్కలు నాటిన స్టూడెంట్స్‌కు గ్రీన్ పాస్‌పోర్ట్స్
- పర్యావరణ పరిరక్షణలో విద్యార్థుల భాగస్వామ్యం
- జిల్లాలో ఇప్పటికే 62వేల మొక్కలు పంపిణీ




చాగలమర్రి బాలికల పాఠశాలలో మొక్క నాటుతున్న విద్యార్థులు, హెచ్‌ఎం

చాగలమర్రి, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు గ్రీన్ పాస్‌పోర్ట్ ఇస్తున్నారు. అయితే ఇది మన గుర్తింపును తెలియజేసే పాస్‌పోర్టులాంటిది కాదు. అమ్మ పేరుతో మొక్కలు నాటినందుకు ఇచ్చే గ్రీన్ పాస్‌పోర్టు. ఇందులో విద్యార్థులకు సంబంధించిన నాటిన మొక్కల వివరాలు నమోదు చేయడంతో పాటు ఎదుగుదల ఆధారంగా పాయింట్లు ఇస్తారు. విద్యార్థి ఫొటోతో ఉండే గ్రీన్ పాస్‌పోర్టు విద్యార్థులను విశేషంగా ఆకట్టుకుంటోంది. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో మెగా పేరెంట్స్, టీచర్ మీటింగ్(పీటీఎం) నిర్వహించిన రోజునే ఈ కార్యక్రమాన్ని ప్రారంభించి పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. విద్యార్థులతో మొక్కలు నాటించి వాటి సంరక్షణ బాధ్యతలు తీసుకునే కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. మొక్కల పెంపకంపై విద్యార్థుల్లో ఆసక్తి పెంచేందుకు వారికి గ్రీన్ పాస్‌పోర్ట్‌లు అందించాలని నిర్ణయించారు. అమ్మ పేరుతో ఇప్పటికే మొక్కలు నాటిన విద్యార్థులకు వీటిని అందజేస్తున్నారు. విద్యార్థి ఫొటో, వారు పెంచే మొక్కల వివరాలతో ఉన్న గ్రీన్‌పాస్‌పోర్టు వారిలో ఆసక్తి కలిగిస్తోంది. గ్రీన్‌పాస్‌పోర్టును అందించిన తరువాత మొక్కలు నాటేందుకు ముందుకు వచ్చిన విద్యార్థుల సంఖ్య అధికంగా ఉంది.

అమ్మపేరుతో..

మెగా పీటీఎంలో అమ్మకు వందనం పేరుతో విద్యార్థులతో వారి తల్లిదండ్రులకు పాదాభివందనం చేయించిన ప్రభుత్వం ఇప్పుడు అమ్మ పేరుతో మొక్క(ఏక్‌పేడ్ మాకేనామ్) వారిని పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు చేసే చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా విద్యార్థులకు ఎన్ని మొక్కలు అవసరమో ముందుగానే వివరాలు సేకరించి వారికి వాటిని అందించారు. జిల్లాలోని 29 మండలాల్లో 1,959 పాఠశాలలు ఉన్నాయి. ఆయా పాఠశాలలకు 62 వేల మొక్కలను విద్యార్థులకు అందించి పాఠశాలల ఆవరణలు, ఖాళీ ప్రదేశాల్లో నీటించారు.

గ్రీన్ పాస్‌పోర్టు అంటే..



విద్యార్థి నాటిన మొక్క ఆ విద్యార్థి వివరాలతో కూడినదే గ్రీన్ పాస్ పోర్టు. దీనిని ఆకట్టుకునేలా ఆకుపచ్చ రంగులో తీర్చిదిద్దారు. కవర్‌పై గ్రీన్ పాస్‌పోర్టు, అమ్మపేరుతో మొక్క అని ఉంటుంది. మొదటి పేజీలో విద్యార్థి ఫొటో, పేరు, అపార్ ఐడీ, వయస్సు, పేన్‌ఐడీ, పాఠశాల పేరు, చిరునామా ఉంటుంది. రెండో పేజీలో మొక్క పేరు, దాని శాస్త్రీయ నామం, ఏరోజున మొక్క నాటారు?, ఎక్కడ నాటారు?.. ఆ ప్రదేశం వివరాలను నమోదు చేస్తారు. ఇక్కడి నుంచి మొక్క పెరుగుదలలో విద్యార్థి భాగస్వామ్యం మొదలవుతుంది. ఎప్పటికప్పుడు మొక్క పెరుగుదలను సహచర విద్యార్థులు, ఉపాధ్యాయులతో కలిసి పరిశీలించుకోవాల్సి ఉంటుంది.

విద్యార్థులు ఆసక్తిగా ముందుకు వస్తున్నారు



అమ్మ పేరుతో ఒక మొక్క కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటేందుకు విద్యార్థులు ఆసక్తిగా ముందుకు వస్తున్నారు. వీరికి ఇచ్చే గ్రీన్‌పాస్ పోర్టు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. అమ్మ కోసం మొక్క నాటడాన్ని విద్యార్థులు బాధ్యతగా ఫీల్ అవుతున్నారు. 43 పాఠశాలల్లో మొక్కలను అందించాం. గ్రీన్ పాస్‌పోర్టులను పంపిణీ చేశాం.

- న్యామతుల్ల, ఎంఈవో, చాగలమర్రి



కస్తూర్బాలో మొక్క నాటుతున్న ఎస్‌వో, బాలికలు

మొక్కల కోసం ఏమి చేయాలి?

అమ్మ పేరుతో ఒక మొక్క కార్యక్రమంలో పాల్గొనేందుకు ఆసక్తిగల విద్యార్థి వివరాలను ప్రతి పాఠశాలలో తీసుకుంటారు. వీరు ఒకటి నుంచి మూడు రకాల మొక్కల వరకు ఎంపిక చేసుకునే అవకాశం కల్పించారు. ఒక మొక్క చనిపోతే మరో మొక్క నాటేందుకు అవకాశం ఉంటుంది. ఇలా ఎంపిక చేసుకోగానే పేరు, అపార్ ఐడీ వివరాలను ఉపాధ్యాయులు నమోదు చేస్తారు. ఇప్పటికే పలు పాఠశాలల్లో ఈ ప్రక్రియ జరుగుతోంది. అటవీశాఖ సూచించిన నర్సరీ పాయింట్ల వద్దకు వెళ్లి విద్యార్థులు కోరుకున్న మొక్కలను పాఠశాలకు తీసుకొచ్చి వారికి ఎంఈవోలు, హెచ్‌ఎంలు అప్పగించాలి. ఇందుకు విద్యాశాఖ సమగ్ర శిక్ష ద్వారా ప్రతి మొక్కకు రవాణా, ఇతర చార్జీలుగా నిధులు మంజూరు చేశారు. ఈ విధంగా వచ్చిన తరువాత విద్యార్థులు మొక్కలు నాటి సెల్ఫీలు తీసుకోవాలి. ఈ ప్రక్రియను లీప్ యాప్ ద్వారా పూర్తి చేయాలి.

53 సెల్‌ఫోన్లు రికవరీ

బాధితులకు అందజేసిన డీఎస్పీ



సెల్‌ఫోన్‌ను అందజేస్తున్న డీఎస్పీ ప్రమోద్

ఆళ్లగడ్డ, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): ఆళ్లగడ్డ సబ్ డివిజన్ పరిధిలో పోలీసులు 53 సెల్‌ఫోన్‌లు ట్రేస్ చేసి రికవరీ చేశారు. ఈ సెల్‌ఫోన్లను శనివారం డీఎస్పీ ప్రమోద్ ఫిర్యాదుదారులకు అందజేశారు. ఆయన మాట్లాడుతూ సెల్‌ఫోన్ పోయిన వెంటనే సమీప పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసి సీఈఐఆర్ పోర్టల్‌లో మొబైల్ వివరాలు నమోదు చేయాలన్నారు. పోలీస్ చాట్‌బార్ నెంబర్ 9121101107కు సందేశం పంపి అవసరమైన వివరాలు నమోదు చేయాలన్నారు. ఈ వివరాలు సెంట్రల్ డేటాబేస్‌లోకి చేరి మొబైల్‌ను ట్రేస్ చేసిన తరువాత యజమానులకు అందజేయనున్నట్లు తెలిపారు.

నేడు 'స్వామి వివేకానంద' పుస్తకావిష్కరణ

కర్నూలు కల్చరల్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): కర్నూలుకు చెందిన రచయిత ఇంద్రకంటి వేంకటేశ్వర్లు రచించిన యుగపురుషుడు 'స్వామి వివేకానంద' పుస్తక ఆవిష్కరణ ఆదివారం ఉదయం 10.30 గంటలకు నగరంలోని చిదంబరరావు వీధిలోగల స్వామి వివేకానంద సంస్కృత పాఠశాల్లో ఏర్పాటుచేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమానికి సభాధ్యక్షుడిగా ప్రముఖ న్యాయవాది, సంస్కృత పాఠశాల కరస్పాండెంట్ ఎండీవీ జోగయ్య శర్మ వ్యవహరిస్తారని, ముఖ్య అతిథిగా రవీంద్ర విద్యాసంస్థల అధినేత జి.పుల్లయ్య హాజరవుతారని వివరించారు. విశ్రాంత ప్రిన్సిపాల్ డాక్టర్ కొట్టె చెన్నయ్య పుస్తక సమీక్ష చేస్తారని తెలిపారు.

పట్టుబడి పంతులయ్యారు..!

(3వ పేజీ తరువాయి)

సర్టిఫికెట్ల పరిశీలనకు సన్నాహాలు

జిల్లాలో డీఎస్సీ-2025 ప్రతిభ చూపి ఉపాధ్యాయ ఉద్యోగం ఖరారు అయిన అభ్యర్థుల దరఖాస్తులు పరిశీలనకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. 50 అభ్యర్థులకు ఒక బృందం ఉంటుంది. సోమవారం నుంచి సర్టిఫికెట్లు పరిశీలిస్తారు. ప్రతి జిల్లాకు సీనియర్ అధికారులను ఇన్‌చార్జిగా నియమిస్తారు. ఒకేసారి అన్ని సర్టిఫికెట్లు పరిశీలన పూర్తి చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. శనివారం సునయన ఆడిటోరియంలో ఎంఈవోలు, ప్రధానోపాధ్యాయులు, డిప్యూటీ తహసీల్దారులు, డేటా ఎంట్రీ ఆపరేటర్లకు శిక్షణ ఇచ్చారు. విద్యా శాఖ రాష్ట్ర సంయుక్త సంచాలకులు అబ్రహం, ప్రాంతీయ సంచాలకులు కె.శామ్యూల్ వర్చువల్ ద్వారా విధివిధానాలను వివరించారు. కర్నూలు, నంద్యాల డీఈవోలు ఎస్.శామ్యూల్‌పాల్, జనార్దన్‌రెడ్డి, కర్నూలు జిల్లా ట్రైబల్ వెల్ఫేర్, సాంఘిక సంక్షేమ, బీసీ సంక్షేమ శాఖల అధికారులు హాజరయ్యారు. ఎస్జీటీ అభ్యర్థులకు కర్నూలులోని రాయలసీమ యూనివర్సిటీలో, స్కూల్ అసిస్టెంట్ (ఎస్ఏ) లాంగ్వేజ్ అభ్యర్థులు నన్నూరు సమీపంలో మారుతి ఎస్టేట్ శ్రీరాఘవేంద్ర బీఎడ్ కళాశాలలో, స్కూల్ అసిస్టెంట్ నాన్-లాంగ్వేజ్ అభ్యర్థులు నన్నూరు సమీపంలో మారుతి ఎస్టేట్-2లో ఉన్న శ్రీనివాస బీఎడ్ కళాశాలలో 25వ తేదీ (సోమ వారం) నుంచి సర్టిఫికెట్ల పరిశీలన ఉంటుందని కర్నూలు డీఈవో తెలిపారు. 54బృందాలు (టీమ్‌లు), 216 మంది విద్యా, రెవెన్యూ, వైద్య అధికారులు పరిశీలనలో పాల్గొంటారు. 170 మంది వలంటీర్లు అందుబాటులో ఉంటారు. సమచారం కోసం హెల్ప్ డెస్క్‌లో ఉండే నరసయ్య-81218 21266, సూపరింటెం డెంట్ మదుల్లా-96036 83182, ఏడీ కె.నాగభూషణం-91776 79042 లకు కాల్ చేయవచ్చని డీఈవో తెలిపారు.

ఒరిజినల్ సర్టిఫికెట్లతో పాటు..

డీఎస్సీ అర్హత సాధించిన అభ్యర్థులు సంబంధిత విద్యార్హత ఒరిజినల్ సర్టిఫికెట్లతో పాటు ఇటీవల తీసుకున్న కుల ధ్రువీకరణ పత్రం, గెజిటెడ్ అధికారితో ధ్రువీకరించిన మూడు సెట్లు సర్టిఫికెట్ల జిరాక్స్ కాపీలు, ఐదు పాస్‌పోర్టు సైజ్ ఫొటోలతో ధ్రువపత్రాల పరిశీలనకు హాజరు కావాల్సి ఉంటుంది. అంతకు ముందే ఆసర్టిఫికెట్లు వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలని విద్యా శాఖ అధికారులు తెలిపారు. అభ్యర్థులు వారికి కేటాయించిన తేదీ, సమయానికి సర్టిఫికెట్ల పరిశీలనకు హాజరు కాకపోతే వారి అభ్యర్థిత్వం రద్దుచేసి, ఆ తరువాత మెరిట్ ఉన్న అభ్యర్థిని సర్టిఫికెట్ల పరిశీలనకు పిలుస్తారు. దీంతో ఎన్ని ఇబ్బందులున్నా, కేటాయించిన తేదీ, సమయానికి సర్టిఫికెట్ల పరిశీలనకు హాజరు కావాలని డీఈవో శామ్యూల్‌పాల్ 'ఆంధ్రజ్యోతి'కి వివరించారు. కుల, రెవెన్యూ సర్టిఫికెట్ల పరిశీలనకు రెవెన్యూ అధకారులు, దివ్యాంగ సర్టిఫికెట్ల పరిశీలనకు డాక్టర్లు అందుబాటులో ఉంటారు. ఒకే అభ్యర్థికి రెండు, మూడు ఉద్యోగాలకు ఎంపికై, అందులో ఒక పోస్టును ఎంపిక చేసుకుంటే, మిగిలిన పోస్టులకు తర్వాత అభ్యర్థులను సర్టిఫికెట్ల పరిశీలనకు పిలుస్తారు. దీంతో కటాఫ్ మార్కులు, ర్యాంకుల్లో స్వల్ప తేడాలు వచ్చే అవకాశం లేకపోలేదు.

గురువు ఉద్యోగం సాధించాలన్నదే..

- స్కూల్ అసిస్టెంట్ జిల్లా టాపర్‌గా సాయినవీన్



కుటుంబ సభ్యులతో సాయి నవీన్

ఆదోని అగ్రికల్చర్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): టీచర్ ఉద్యోగం సాధించాలన్న తపనతో రోజుకు 12 నుంచి 16 గంటల పాటు చదివి పట్టుబట్టి సాధించారు. రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన డీఎస్సీ ఫలితాల్లో ఆదోనికి చెందిన సాయి నవీన్ స్కూల్ అసిస్టెంట్ ఇంగ్లీష్‌లో జిల్లా మొదటి స్థానంలో నిలిచారు. తండ్రి ఆర్ కిషోర్ రిటైర్డ్ ఉద్యోగి, తల్లి జె.విజయ్ కుమార్ ఆస్పరి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎంగా పనిచేస్తున్నారు.

ర్యాంకుల దీపిక



నంద్యాల ఎన్జీవోస్ కాలనీకి చెందిన దీపిక ఏకంగా మూడు ర్యాంకులు సాధించారు. పశ్చిమ గోదావరి జిల్లా రాజమండ్రికి చెందిన దీపిక నంద్యాలకు చెందిన డ్రాయింగ్ మాస్టర్ ఆదిశేషను వివాహం చేసుకుంది. పట్టణంలోని పలు పాఠశాలల్లో ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్నారు. పశ్చిమగోదావరి జిల్లాలో జిల్లాస్థాయిలో మొదటిర్యాంక్, పీజీటీ జోన్-2లో రెండవ ర్యాంక్, టీజీటీలో 7వ ర్యాంక్ సాధించారు.

కౌతాళం మండలానికి ర్యాంకుల పంట



స్వాతి, వడ్డే నాగరాజు, కావ్య

కౌతాళం, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): డీఎస్సీ మెరిట్ లిస్ట్‌లో కౌతాళం మండలంకు చెందిన విద్యార్థులు ర్యాంకులు సాధించి ఉపాధ్యాయ కొలువులను చేజిక్కించుకున్నారు. ముఖ్యంగా కన్నడ మీడియం విభాగంలో నదిచాగి గ్రామానికి చెందిన 8 మంది ఉపాధ్యాయ కొలువులకు ఎంపిక కావడంతో ఆగ్రామంలో ప్రజలు సంబరాలు చేసుకున్నారు. మండలంలోని నదిచాగి గ్రామం నుంచే ఎనిమిది మంది ఉపాధ్యాయ కొలవులు సాధించారు. స్కూల్ అసిస్టెంట్ల విభాగంలో సోషల్‌లో జిల్లా మొదటి ర్యాంకు స్వాతి, కన్నడలో జిల్లా రెండో ర్యాంకు వడ్డే నాగరాజు, గణితంలో జిల్లా 5వ ర్యాంకు మంజుశ్రీ, ఎస్జీటీ కన్నడలో కావ్య జిల్లా 3వ ర్యాంకు, తొగట చరణ్ రాజ్ జిల్లా 10వ ర్యాంకు, రాంతుల్లా 14, విజయ్ కుమార్ 25, వైశాఖ శెట్టి 29వ ర్యాంకులు సాధించారు. ఒకేసారి తమ గ్రామం నుంచి 8 మంది ఉపాధ్యాయ పోస్టులకు ఎంపిక కావడంతో గ్రామస్థులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. అలాగే మండల పరిధిలోని ఎరిగేరి గ్రామానికి చెందిన జయకర్ స్కూల్ అసిస్టెంట్ విభాగంలో ఇంగ్లీష్‌లో జిల్లా 10వ ర్యాంకు సాధించారు.

ప్రభాకరుడి ప్రతిభ

- రెండు ఉద్యోగాలకు ఎంపిక



నంద్యాల హాస్పిటల్: కర్నూలు జిల్లా సి.బెళగల్‌లోని డా.బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో పీఈటీగా కాంట్రాక్ట్ పద్ధతిన పని చేస్తున్న డేరంగుల ప్రభాకర్ డీఎస్సీలో ప్రతిభ చాటాడు. రెండు ఉద్యోగాలకు ఎంపిక అయ్యాడు. జూపాడుబంగ్లా మండలం తూడిచెర్లకి చెందిన సాధారణ రైతు కుటుంబం రామకృష్ణుడు, వరలక్ష్మమ్మకు రామగోపాల్, బాలకృష్ణ, ప్రభాకర్ అనే ముగ్గురు సంతానం. చివరివాడైన ప్రభాకర్ బీపీఈడీ కోర్సు చేసి పీఈటీగా పనిచేస్తున్నారు. ఇటీవలి డీఎస్సీలో పీఈటీ పోస్టుకు 83మార్కులతో రాయలసీమ జోన్‌స్థాయిలో 17వ ర్యాంక్ సాధించి పీఈటీగా ఎంపికయ్యారు. అలాగే 85మార్కులతో స్కూల్ అసిస్టెంట్ ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్ పోస్టుకు 11వ ర్యాంక్ సాధించి ఎంపికయ్యారు.

టైలర్ మాస్టర్



శిరివెళ్ల: టైలరింగ్ పనిచేస్తున్న నసీరుద్దీన్ డీఎస్సీలో సత్తా చాటి గురువుగా మారనున్నారు. శిరివెళ్లకు చెందిన నసీరుద్దీన్ స్కూల్ అసిస్టెంట్ హిందీ విభాగంలో 82.37మార్కులతో ఉమ్మడి కర్నూలు జిల్లా స్థాయిలో మొదటి ర్యాంకు సాధించారు. ఉపాధ్యాయ ఉద్యోగం సాధించి విద్యార్థులను భావిభారత పౌరులుగా తీర్చిదిద్దాలన్న సంకల్పం నెరవేరిందని నసీరుద్దీన్ అన్నారు. జిల్లాస్థాయిలో మొదటి ర్యాంకు సాధిం చిన ఆయనను పలువురు గ్రామపెద్దలు, ఉపాధ్యాయులు అభినందించారు.

అద్దె వాహనం పేరుతో అక్రమాలు

- స.హ చట్టం ద్వారా వెలుగులోకి



మాట్లాడుతున్న ముందడుగు జిల్లా అధ్యక్షుడు దేశాయి చంద్రన్న

ఆదోని అగ్రికల్చర్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): డివిజన్ లెవెల్ పంచాయతీ అధికారులు అద్దె వాహనం పేరుతో అక్రమాలకు పాల్పడ్డారని ముందడుగు వేదిక జిల్లా అధ్యక్షుడు దేశాయి చంద్రన్న ఆరోపించారు. శనివారం ఆయన భీమాస్ హాలులో స.హ. చట్టం కార్యకర్తలతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జీవో ఎమ్మెస్ నెంబర్ 87, 1/7/2017 ప్రకారం డీఎల్‌పీవో కార్యాలయ అధికారులు వినియోగిస్తున్న అద్దె వాహనాలు, అద్దె చెల్లింపు వివరాలు ఇవ్వాలని స.హ చట్టం కార్యకర్త శాంతకుమార్ దరఖాస్తు చేసుకున్నారన్నారు. 2017 ఏప్రిల్ ఒకటి నుంచి 2024 నవంబరు 30 వరకు రెండు వాహనాలు వినియోగించినట్లు, అందుకు రూ.20లక్షలు వాహన యజమాని ప్రతాప్‌నకు చెల్లించినట్లు సమాచారం ఇచ్చారన్నారు. ఏపీ 21 ఏఎస్4760, ఏపీ 39 యూబీ 1554 ఎల్లో బోర్డు వాహనాలు వినియోగిస్తున్నట్లు తెలిపారన్నారు. కాగా ఈ వాహనాలకు సంబంధించిన వివరాల కోసం జిల్లా రవాణా శాఖ అధికారికి దరఖాస్తు చేసుకున్నామన్నారు. ఏపీ 21 ఏఎస్ 4760 వాహనం మోటార్ సైకిల్ అని, మరో వాహనం ఎల్లో బోర్డు అని తెలియజేశారని వివరించారు. కాగా కార్యాలయానికి అద్దె ప్రాతిపదికన వాహనాలు నాలుగు చక్రాలవి మాత్రమే వాడాలని తెలిపారన్నారు. అయితే మోటార్ సైకిల్ నెంబర్‌తో రూ.20 లక్షల ప్రజాధనాన్ని స్వాహా చేశారని ఆరోపించారు. దీనిపై కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఈ విషయమై కలెక్టర్, ఏసీబీ, జిల్లా పంచాయతీ అధికారికి ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు. పంచాయతీ అధికారులు తిమ్మక్క, నూర్జహాన్, శ్రీనివాసులుపై చర్యలు తీసుకుని దుర్వినియోగమైన నిధులను రాబట్టాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ముందడుగు వేదిక కార్యకర్తలు శాంతకుమార్, కృష్ణన్న, రవి తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ ఏజెంట్‌గా ఎన్నికల కమిషన్

- ఏఐసీసీ సభ్యుడు, నంద్యాల డీసీసీ అధ్యక్షుడు లక్ష్మీనరసింహ యాదవ్



ర్యాలీ నిర్వహిస్తున్న కాంగ్రెస్ నాయకులు

కల్లూరు, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): ఎన్నికల కమిషన్ బీజేపీ ఏజెంట్‌గా పనిచేస్తోందని ఏఐసీసీ సభ్యుడు, నంద్యాల డీసీసీ అధ్యక్షుడు లక్ష్మీనరసింహ యాదవ్ ఆరోపించారు. కర్నూలు నగరంలోని నంద్యాల చెక్‌పోస్టు సమీపంలోని దామోదరం సంజీవయ్య భవనం నుంచి బీజేపీకి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, నాయకులు శనివారం భారీ ఎత్తున ర్యాలీ నిర్వహించారు. స్వతంత్ర వ్యవస్థ కాస్త బీజేపీలో కీలుబొమ్మగా మారిందని ఆరోపిం చారు. పవిత్రమైన ఓటు బీజేపీ అధికార దాహానికి దుర్వినియోగం అవుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఎన్నికల కమిషన్ తీరుపై నిప్పులాంటి నిజాలను రాహుల్‌గాంధీ బయట పెట్టారని, అయితే సమాధానం చెప్పాల్సిన ప్రధాని మోదీ మౌనం వహిస్తున్నారని ధ్వజమెత్తారు. డిక్లరేషన్ అంటూ వెనుకుండి నాటకాలు ఆడిస్తున్నారని మండిపడ్డారు. రాహుల్‌గాంధీ సంధించిన 5 ప్రశ్నలకు ఈసీ వెంటనే సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో డోన్, శ్రీశైలం, నంద్యాల, ఆళ్లగడ్డ, నందికొట్కూరు, బనగానపల్లె నియోజకవర్గాల ఇన్‌చార్జిలు మద్దిలేటి, ఇస్మాయిల్, పుల్లయ్య, హుస్సేన్‌బాషా, నాగరాజు, బాలు యాదవ్, కర్నూలు నగర ఇన్‌చార్జి జిలానీబాషా, నాయకులు అనంతరత్నం మాదిగ, జనార్దన్, వై.సంజీవ్‌కుమార్, రాజాక్ వలి, హబీబ్ పఠాన్, జాకీర్ హుస్సేన్, ఆరిఫ్, మండలాల అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు పాల్గొన్నారు.

రికార్డులు సక్రమంగా ఉంచాలి



మాట్లాడుతున్న రాష్ట్ర వక్ఫ్‌బోర్డు సీఈవో మహ్మద్ అలీ

- రాష్ట్ర వక్ఫ్‌బోర్డు చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ మహ్మద్ అలీ

నంద్యాల ఎడ్యుకేషన్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): వక్ఫ్ సంస్థల ఆస్తుల వివరాల రికార్డులను సక్రమంగా ఉంచాలని రాష్ట్ర వక్ఫ్‌బోర్డు చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ మహ్మద్ అలీ అన్నారు. నంద్యాల జిల్లా కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాల్‌లో ఉమ్మడి జిల్లాల ముతవల్లీలతో శనివారం సమావేశమయ్యారు. వక్ఫ్‌బోర్డు కేవలం 7శాతం ఆదాయం మాత్రమే నిధులుగా సేకరిస్తుందని, మిగిలిన 93 శాతం ఆదాయాన్ని వక్ఫ్ డీడ్‌ల ప్రకారం పేదల సంక్షేమం, విద్యారంగం కోసం వినియోగించాలన్నారు. కానీ అనేక సంస్థలు నిబంధనలను పాటించడం లేదన్నారు. అనంతరం ఉమ్మీద్ పోర్టల్‌పై అవగాహన కల్పించారు. జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి సయ్యద్ సబీహా పార్వీన్ మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాల్లో ఎక్కువ సంఖ్యలో వక్ఫ్ సంస్థలు ఉన్నాయని, వాటి రక్షణకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. సమావేశంలో 300 మంది ముతవల్లీలు, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ నిధులను సర్పంచ్ కాజేశారు

- ఎంపీడీవోకు సాతనూరు గ్రామస్థుల ఫిర్యాదు



బురద రోడ్డును చూపుతున్న సాతనూరు గ్రామస్థులు

కోసిగి ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): సర్పంచ్, ఆమె కుటుంబ సభ్యులు పంచాయతీ నిధులను కాజేశారని సాతనూరు గ్రామస్థులు వెంకటేశ్, నజీర్‌తో సుమారు వంద మంది గ్రామస్థులు ఆరోపించారు. సమాచారం హక్కు చట్టం కింద సమాచారం తీసుకున్నారు. ఈ నేపథ్యంలో శనివారం ఎంపీడీవో ఈశ్వరయ్యస్వామికి ఫిర్యాదు చేశారు. గ్రామస్థులు మాట్లాడుతూ 2024-25 మధ్య కాలంలో సాతనూరు పంచాయతీ నుంచి సర్పంచ్, కుటుంబ సభ్యులు రూ.1.20 కోట్లు నిధులు మంజూరు చేయగా.. అందులో రూ.40 లక్షలు మాత్రమే పనులు చేసినట్లు తెలిసిందని, మిగతా డబ్బులకు ఏవేవో లెక్కలు చూపి పంచాయతీ సర్పంచ్, కుటుంబ సభ్యులు కాజేశారని ఆరోపించారు. గ్రామంలోని బీసీ, ఎస్సీ, వాల్మీకి నగర్‌లో నేటికీ కూడా బురద రోడ్లు, డ్రైనేజీ లేని రోడ్లు ఉన్నాయని, తాగడానికి నీరు సక్రమంగా రావడం లేదని, వీధి లైట్లు, దోమల బెడద అధికంగా ఉందని, ఫాగింగ్ కూడా చేయడం లేదని అన్నారు. గతంలో పని చేసిన పంచాయతీ అధికారుల అండదండలతో వారికి మామూళ్లు ఇచ్చుకుని సాతనూరు పంచాయతీలో తప్పుడు బిల్లులు చూపించి స్వాహా చేశారని గ్రామస్థులు ఆరోపించారు. అలాగే గ్రామంలోని బురద రోడ్లను, ఇళ్ల ముందు వర్షపు నీరు నిల్వ ఉండడాన్ని చూపారు. గ్రామస్థుల ఫిర్యాదుపై విచారిస్తామని ఎంపీడీవో చెప్పారు.

పకడ్బందీగా జీఎన్ఎం పరీక్షలు

కర్నూలు హాస్పిటల్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): కర్నూలు మెడికల్ కాలేజీలో జరుగుతున్న జీఎన్ఎం నర్సింగ్ సప్లిమెంటరీ పరీక్ష కేంద్రాన్ని శనివారం కర్నూలు జీజీహెచ్ సూపరింటెండెంట్ డా.కే.వెంకటేశ్వర్లు అకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులు సెల్‌ఫోన్లు, స్మార్ట్ వాచ్‌లు, పర్సులు, ఇతర ఎలక్ట్రానిక్ వస్తువులను పరీక్ష కేంద్రంలోనికి తీసుకెళ్లకుండా తనిఖీలు చేపట్టినట్లు సూపరింటెండెంట్ తెలిపారు. మాస్ కాపీయింగ్ జరగకుండా పకడ్బందీగా పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రెండోరోజు మెడికల్, సర్జికల్, నర్సింగ్ పరీక్షకలు 144 మందికి గానూ 131 మంది హాజరయ్యారు. 13 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. తనిఖీలో సీఎస్ఆర్ఎంవో డా.వెంకట రమణ, స్కూల్ ఆఫ్ నర్సింగ్ ప్రిన్సిపాల్ వినోదిని పాల్గొన్నారు.

అసంక్రమిత వ్యాధులతో అధిక మరణాలు

- ఆర్‌బీఎస్‌కే జిల్లా కో ఆర్డినేటర్ డాక్టర్ మహేశ్వర్ ప్రసాద్

కర్నూలు హాస్పిటల్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో అసంక్రమిత వ్యాధులతో అధికంగా మరణాలు సంభవిస్తున్నాయని, 30 సంవత్సరాలు దాటిన వారిలో బీపీ, షుగర్, వంటి సమస్యలు వస్తున్నాయని రాష్ట్రీయ బాలస్వాస్థ్య కార్యక్రమం (ఆర్‌బీఎస్‌కే) జిల్లా కో ఆర్డినేటర్ డాక్టర్ మహేశ్వర ప్రసాద్ అన్నారు. కర్నూలు మెడికర్ కాలేజీ న్యూ ఆడిటోరియంలో ఎన్‌సీడీ-4-0 క్యాన్సర్ వ్యాధి నివారణపై వైద్యుల శిక్షణ ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. నోటి, రొమ్ము, గర్భాశయ చికిత్స చేయించుకోవాలన్నారు. అసంక్రమిత వ్యాధులు ఉన్న వారు ఆరోగ్యంగా కనిపిస్తున్నా శరీరం లోపల గుండె, ఊపిరితిత్తులు, కిడ్నీ, కళ్లు, వంటి కీలక అవయవాల పనితీరు మందగిస్తుందని హెచ్చరించారు.

కారు ఢీకొని వ్యక్తి దుర్మరణం

నంద్యాల టౌన్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): పట్టణ శివారులో శనివారం కారు ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందినట్లు ట్రాఫిక్ సీఐ మల్లికార్జున గుప్త తెలిపారు. వివరాలు.. ఒంగోలు జిల్లా కనిగిరి మండలం సీఎస్ పురం గ్రామానికి చెందిన దేవదాస్ (45) నంద్యాలలో భవన నిర్మాణ కూలీగా పనిచేసే వాడు. శనివారం ఉదయం కాలకృత్యాలు తీర్చుకోవడానికి హైవేపైకి రాగా హైదరాబాద్ నుంచి తిరుపతి వెళ్తున్న కారు ఢీకొట్టి మరణించాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నంద్యాల జీజీహెచ్‌కు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

ఏబిసి క్లీన్‌టెక్ ప్రైవేట్ లిమిటెడ్

యూనిట్ 702, 7th ఫ్లోర్, టవర్ 3, ఈక్వినాక్స్ బిజినెస్ పార్క్, ఆఫ్ బాంద్రా కుర్లా కాంప్లెక్స్, LBS మార్గ్, కుర్లా (W) ముంబై - 400070.

బహిరంగ ప్రకటన

ఏబిసి క్లీన్‌టెక్ ప్రైవేట్ లిమిటెడ్ దాని కార్యాలయం హెచ్. నం. 6-3-680/8/3, ప్లాట్ నం. 03, 2వ అంతస్తు, పిఎంఆర్ ప్లాజా, ఠాకుర్ మాన్షన్ లేన్, సోమాజిగూడ, హైదరాబాద్ - 500082, తెలంగాణ, భారతదేశం వారు కేంద్ర ప్రభుత్వానికి దరఖాస్తు చేయాలనుకుంటున్నది విద్యుత్ చట్టం, 2003లోని సెక్షన్ 164 ప్రకారం అతనికి అన్ని అధికారాలను ఇవ్వడానికి భారతదేశం టెలిగ్రాఫ్ లైన్లు మరియు పోస్టలు ఏర్పాటుకు సంబంధించి ఇండియన్ టెలిగ్రాఫ్ చట్టం, 1885 ప్రకారం టెలిగ్రాఫ్ అధికారం కలిగి ఉన్న పనుల సరైన సమన్వయం కోసం విద్యుత్ ప్రసారం కోసం లేదా టెలిఫోనిక్ లేదా టెలిగ్రాఫిక్ కమ్యూనికేషన్ల ప్రయోజనం కోసం విద్యుత్ లైన్లు లేదా ఎలక్ట్రికల్ ప్లాంట్లను ఉంచడం. ప్రభుత్వం ఏర్పాటు చేసిన లేదా నిర్వహించే టెలిగ్రాఫ్ యొక్క ఉద్దేశ్యం లేదా అలా ఏర్పాటు చేయడం లేదా నిర్వహించడం మరియు సర్వే, నిర్మాణం, ఇన్‌స్టాలేషన్, ఇన్‌స్పెక్షన్, ఎరెక్షన్లను చేపట్టడం మరియు కింది ప్రసార పథకాల కోసం కమీషన్, ఆపరేషన్, మైంటెనెన్సు మరియు ఇతర పనులు,

ప్రసార పథకం పేరు: ఏబిసి క్లీన్‌టెక్ ప్రైవేట్ లిమిటెడ్, దాని 250 మెగావాట్ల వాయు విద్యుత్ ప్రాజెక్ట్ కోసం కనెక్టివిటీని అందించడానికి ట్రాన్స్మిషన్ సిస్టమ్ తో సహా అంకితమైన ట్రాన్స్మిషన్ ఓవర్ హెడ్ లైన్స్, కర్నూల్ జిల్లా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం లో ఇన్స్టాలేషన్ చేయడం.

పథకం కింద కవర్ చేయబడిన పనులు:

ఏబిసి క్లీన్‌టెక్ ప్రైవేట్ లిమిటెడ్ యొక్క జనరేషన్ పూలింగ్ స్టేషన్ (జనరేషన్ స్విచ్యార్డ్ ఎడవల్లి గ్రామం, మద్దికేరా తాలూకా, కర్నూల్ జిల్లా, ఆంధ్ర ప్రదేశ్) నుండి అనంతపురం PS (ISTS S/S) వరకు D/c టవర్లపై 400 kV S/c లైన్ సుమారు 15 కి.మీ. పొడవు, అందులో 2-3 కి. మీ అనంతపురం పి. ఎస్ ఎండ్ నుండి 2-3 కి.మీ మార్గాన్ని ఎం/సి టవర్లపై అమలు చేస్తారు) యొక్క డెడికేటెడ్ ఓవర్ హెడ్ ట్రాన్స్‌మిషన్ లైను ఇన్స్టాల్ చేయడం.

విద్యుత్ చట్టం 2003లోని సెక్షన్ 68(1) ప్రకారం సెంట్రల్ ఎలక్ట్రిక్ అథారిటీ యొక్క సిఫార్సుల ఆధారంగా 05 మే 2025 నాటి ఉత్తరం సంఖ్య 25-17/44/2025-PG ద్వారా పై ట్రాన్స్ మిషన్ ప్రాజెక్ట్ ఇప్పటికి భారత ప్రభుత్వ విద్యుత్ మంత్రిత్వ శాఖ ద్వారా ఆమోదించబడింది.

పథకం కింద కవర్ చేయబడిన ట్రాన్స్మిషన్ లైన్లు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని క్రింది గ్రామాలు,పట్టణాలు మరియు నగరాల గుండా, చుట్టూ మరియు వాటి మధ్య వెళతాయి.

క్ర.సం.	గ్రామాల పేర్లు	మండలం/ తాలుకా	జిల్లా
1	మల్లేనిపల్లి, ధొనిముక్కల, గుంతకల్, నల్లదాసరపల్లి, తిమ్మాపురం, తిమ్మాపురం తాండ, నక్కనదొడ్డి, నర్సాపురం, అమీనపల్లి, గుండాల, మొందింతురుకల కొట్టాల, దోసలుడికి, గుండాల తాండ, కసాపురం, జి కొట్టాల, నేలగొండ, పులిగుట్టపల్లి, కొనకొండ్ల, సంగాల, మొలకపెంట, కొంగనపల్లి, పాతకోత్త చెరువు, గొందెర్ల, బొమ్మనపల్లి బొమ్మనపల్లి కొట్టాల, బొమ్మనపల్లి తాండ.	గుంతకల్	అనంతపురం
2.	మద్దికేర (తూర్పు)	మద్దికేర (తూర్పు)	కర్నూల్

రూట్ అలెన్మెంట్ కాపీ కింద సంతకం చేసిన వారి కార్యాలయంలో అందుబాటులో ఉంది. ఈ నోటీసును ప్రచురించిన తేదీ నుండి రెండు నెలలలోపు ప్రతిపాదిత ప్రసార వ్యవస్థపై వ్రాతపూర్వకంగా దిగువ సంతకం చేసిన కార్యాలయానికి పరిశీలన/ప్రాతినిధ్యం ఇవ్వాలని ప్రజలకు నోటీసు ఇవ్వబడింది. మరిన్ని వివరాలు మరియు వివరణల కోసం దయచేసి సంప్రదించండి.

పేరు. ఎం. రాంబాబు
హెూదా : అసిస్టెంట్ జనరల్ మేనేజర్
కార్యాలయ చిరునామా : ఏబిసి క్లీన్‌టెక్ ప్రైవేట్ లిమిటెడ్
ప్లాట్ నం. 3-బి, LP No.31/1989, శ్రీశ్రీనివాస రియల్ ఎస్టేట్, కసాపురం రోడ్, గుంతకల్- 515801.
ఈ-మెయిల్: powerapprovals@axisenergy.in
ఫోన్ నంబర్ : +91 9502212277.

ఏబిసి సీటి ఆర్‌ఈ పార్క్(01) ప్రైవేట్ లిమిటెడ్

యూనిట్ 702, 7th ఫ్లోర్, టవర్ 3, ఈక్వినాక్స్ బిజినెస్ పార్క్, ఆఫ్ బాంద్రా కుర్లా కాంప్లెక్స్, LBS మార్గ్, కుర్లా (W) ముంబై - 400070.

బహిరంగ ప్రకటన

ఏబిసి సీటి ఆర్‌ఈ పార్క్ (01) ప్రైవేట్ లిమిటెడ్, దాని కార్యాలయం హెచ్. నం. 6-3-680/8/3 ప్లాట్ నం. 03, 2వ అంతస్తు, పిఎంఆర్ ప్లాజా, ఠాకుర్ మాన్షన్ లేన్, సోమాజిగూడ, హైదరాబాద్ - 500082, తెలంగాణ, భారతదేశం వారు కేంద్ర ప్రభుత్వానికి దరఖాస్తు చేయాలనుకుంటున్నది విద్యుత్ చట్టం, 2003లోని సెక్షన్ 164 ప్రకారం అతనికి అన్ని అధికారాలను ఇవ్వడానికి భారతదేశం టెలిగ్రాఫ్ లైన్లు మరియు పోస్టలు ఏర్పాటుకు సంబంధించి ఇండియన్ టెలిగ్రాఫ్ చట్టం, 1885 ప్రకారం టెలిగ్రాఫ్ అధికారం కలిగి ఉన్న పనుల సరైన సమన్వయం కోసం విద్యుత్ ప్రసారం కోసం లేదా టెలిఫోనిక్ లేదా టెలిగ్రాఫిక్ కమ్యూనికేషన్ల ప్రయోజనం కోసం విద్యుత్ లైన్లు లేదా ఎలక్ట్రికల్ ప్లాంట్లను ఉంచడం. ప్రభుత్వం ఏర్పాటు చేసిన లేదా నిర్వహించే టెలిగ్రాఫ్ యొక్క ఉద్దేశ్యం లేదా అలా ఏర్పాటు చేయడం లేదా నిర్వహించడం మరియు సర్వే, నిర్మాణం, ఇన్‌స్టాలేషన్, ఇన్‌స్పెక్షన్, ఎరెక్షన్లను చేపట్టడం మరియు కింది ప్రసార పథకాల కోసం కమీషన్, ఆపరేషన్, మైంటెనెన్సు మరియు ఇతర పనులు,

ప్రసార పథకం పేరు: ఏబిసి సీటి ఆర్‌ఈ పార్క్ (01) ప్రైవేట్ లిమిటెడ్ దాని 250 మెగావాట్ల వాయు విద్యుత్ ప్రాజెక్ట్ కోసం కనెక్టివిటీని అందించడానికి ట్రాన్స్మిషన్ సిస్టమ్‌తో సహా అంకితమైన ట్రాన్స్మిషన్ ఓవర్‌హెడ్ లైన్స్, కర్నూల్ జిల్లా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం లో ఇన్స్టాలేషన్ చేయడం.

పథకం కింద కవర్ చేయబడిన పనులు:

ఏబిసి సీటి ఆర్ ఈ పార్క్ (01) ప్రైవేట్ లిమిటెడ్ మధ్యంతర ఉపకేంద్రం (జనరేషన్ స్విచ్యార్డ్ - హెబ్బటం గ్రామం, హంళగుంద తాలూకా, కర్నూల్ జిల్లా, ఆంధ్ర ప్రదేశ్) నుండి ఏబిసి క్లీన్ టెక్ ప్రైవేట్ లిమిటెడ్ పూలింగ్ స్టేషన్ (జనరేషన్ స్విచ్యార్డ్ ఎడవల్లి గ్రామం, మద్దికేరా తాలూకా, కర్నూల్ జిల్లా, ఆంధ్ర ప్రదేశ్) వరకు D/c టవర్లపై 400 kV S/c లైన్ (సుమారు 55 కి.మీ పొడవు) యొక్క డెడికేటెడ్ ఓవర్ హెడ్ ట్రాన్స్మిషన్ లైన్ ను ఇన్స్టాల్ చేయడం.

విద్యుత్ చట్టం 2003 లోని సెక్షన్ 68(1) ప్రకారం సెంట్రల్ ఎలక్ట్రిక్ అథారిటీ యొక్క సిఫార్సుల ఆధారంగా 05 మే 2025 నాటి ఉత్తరం సంఖ్య 25-17 /43/2025 - PG ద్వారా పై ట్రాన్స్మిషన్ ప్రాజెక్ట్ ఇప్పటికి భారత ప్రభుత్వ విద్యుత్ మంత్రిత్వ శాఖా ద్వారా ఆమోదించబడింది.

పథకం కింద కవర్ చేయబడిన ట్రాన్స్మిషన్ లైన్లు ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రం లోని క్రింది గ్రామాలు, పట్టణాలు మరియు నగరాల గుండా, చుట్టూ మరియు వాటి మధ్య వెళతాయి.

క్ర.సం.	గ్రామాల పేర్లు	మండలం/ తాలూకా	జిల్లా
1	పెద్దగోనేహాలు, హెబ్బటం	హంళగుంద	కర్నూల్
2	చ్యాగి, నారాయణపురం, నాగనాథనహళ్లి, ధనాపురం	ఆదోని	కర్నూల్
3	తిక్కస్వ కొట్టాల, మాదిగ కొట్టాల, మొలగవల్లి, పెద్దహెూతూరు, మరకట్టు, మణికూర్తి, కతారికి, ముసనహళ్లి, కమ్మరచేడు, కురుకుంద, అంగసకల్లు, ఏ గోనేహాల్, హంళీబీడు	ఆలూరు	కర్నూల్
4	జొహరాపురం, చిన్నహెూతూరు, నాగరూర్, ఆస్పరి, చిగలి	ఆస్పరి	కర్నూల్
5	బొమ్మనపల్లి, హంప, పెరవలి, ఎడవల్లి, బొజ్జన్నాయనిపేట, బురుజుల, మద్దికెర పడమర, మద్దికెర ఉత్తరం, మద్దికెర అగ్రహారం, మద్దికెర తూర్పు	మద్దికేర (తూర్పు)	కర్నూల్
6	హెూసూర్	పత్తికొండ	కర్నూల్
7	రామాపురం	తుగ్గలి	కర్నూల్
8	గుండాల, గుండాల తాండ, మొండితురుకల కొట్టాల, దోసలుడికి, నక్కనదొడ్డి, కసాపురం	గుంతకల్	అనంతపురం

రూట్ అలెన్మెంట్ కాపీ కింద సంతకం చేసిన వారి కార్యాలయంలో అందుబాటులో ఉంది. ఈ నోటీసును ప్రచురించిన తేదీ నుండి రెండు నెలలలోపు ప్రతిపాదిత ప్రసార వ్యవస్థపై వ్రాతపూర్వకంగా దిగువ సంతకం చేసిన కార్యాలయానికి పరిశీలన/ప్రాతినిధ్యం ఇవ్వాలని ప్రజలకు నోటీసు ఇవ్వబడింది. మరిన్ని వివరాలు మరియు వివరణల కోసం దయచేసి సంప్రదించండి :

పేరు. ఎం. రాంబాబు
హెూదా : అసిస్టెంట్ జనరల్ మేనేజర్
కార్యాలయ చిరునామా : ఏబిసి సీటి ఆర్‌ఈ పార్క్ (01) ప్రైవేట్ లిమిటెడ్,
ప్లాట్ నం. 3-బి, LP No.31/1989, శ్రీశ్రీనివాస రియల్ ఎస్టేట్, కసాపురం రోడ్, గుంతకల్- 515801.
ఈ-మెయిల్: abcctrepark_ap01@axisenergy.in
ఫోన్ నంబర్ : +91 9502212277.

సారా స్థావరాలపై దాడులు


సారాను స్వాధీనం చేసుకున్న ఎక్సైజ్ అధికారులు

నందికొట్కూరు, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని అయ్యప్పస్వామి దేవాలయం ముందు కంపచెట్లలో సారా స్థావరాలపై అధికారులు దాడులు చేశారు. ఈ దాడుల్లో 250 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేసి, 30 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి సారా తయారు చేస్తున్న ఓ మహిళను అరెస్టు చేశామని సీఐ రామాంజనేయులు తెలిపారు. షికారి మాలటి భర్త షికారి రాజు పరారయ్యాడని, అతనిపై కేసు నమోదు చేశామన్నారు. దాడుల్లో ఎస్ఐలు జఫ్రుల్లా, భాష్యం శ్రీనివాసులు, హెడ్ కానిస్టేబుళ్లు కుమారి, కానిస్టేబుళ్లు శివన్న, మధుప్రసాద్ పాల్గొన్నారు.

నేడు మార్కెట్ యార్డు నూతన పాలకవర్గం ప్రమాణ స్వీకారం

ఆత్మకూరు, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): ఆత్మకూరు మార్కెట్ యార్డు చైర్మన్‌గా వెలుగోడు మండలంలోని రేగడగూడూరుకు చెందిన సీనియర్ టీడీపీ నాయకులు వంగాల వెంకటకృష్ణారెడ్డి ఆదివారం తన బాధ్యతలను స్వీకరించనున్నారు. ఆత్మకూరులోని మార్కెట్ యార్డు ప్రాంగణంలో ఉదయం 11గంటలకు పాలక వర్గం ప్రమాణ స్వీకారానికి అన్ని ఏర్పాట్లను సిద్ధం చేశారు.

28న విద్యుత్ భారాలపై ప్రతిజ్ఞ దినం

ఆత్మకూరు, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): స్మార్ట్ మీటర్లు, ట్రూఆఫ్ చార్జీలు ఉపసంహరించుకోవాలని సీపీఎం నాయకులు రణధీర్, రామ్‌నాయక్ డిమాండ్ చేశారు. శనివారం వారు మాట్లాడుతూ నాటి విద్యుత్ సంస్కరణలకు వ్యతిరేకంగా 2000 సంవత్సరం బషీర్‌బాగ్‌లో జరిగిన కాల్పుల్లో ముగ్గురు మృతిచెందారని అన్నారు. అందుకే విద్యుత్ భారాలకు వ్యతిరేకంగా ఆగస్టు 28న ప్రతిజ్ఞ దినంగా నిర్వహించాలని నిర్ణయించినట్లు చెప్పారు. బలవంతంగా ఏర్పాటు చేస్తున్న స్మార్ట్ మీటర్లను ప్రజలు తిరస్కరించాలని అన్నారు. సమావేశంలో నాయకులు మంజుల, మీనాక్షమ్మ, సురేంద్ర, సురేంద్ర, ఇస్మాయిల్, నాగేశ్వరరావు, సద్దాం హుసేన్, భాస్కర్ ఉన్నారు.

యూరియా కొరత లేకుండా చూడండి

నంద్యాల కల్చరల్, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): నంద్యాల నియోజకవర్గంలో రైతులకు యూరియా కొరత లేకుండా చూసి, రైతులకు అవసరమయ్యే యూరియా తెప్పించాలని మార్క్‌ఫెడ్ మేనేజర్ హరినాథరెడ్డిని నంద్యాల జిల్లా బీజేపీ అధ్యక్షుడు అభిరుచి మధు కోరారు. నంద్యాల మార్క్‌ఫెడ్ కార్యాలయంలో మేనేజర్‌ను అభిరుచి మధు కలిసి యూరియా సమస్యపై చర్చించారు. అనంతరం మార్క్‌ఫెడ్ మేనేజరకు వినతి పత్రం అందజేశారు. మేనేజర్ హరినాథరెడ్డి స్పందిస్తూ రెండు, మూడు రోజుల్లో యూరియా అందుబాటులోకి వస్తుందని తెలిపారన్నారు.

వినాయక చవితిని ప్రశాంతంగా జరుపుకోండి

గడివేముల, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): వినాయకచవితి పండుగను ప్రశాంతంగా నిర్వహించుకోవాలని తహసీల్దార్ వెంకటరమణ, ఎస్ఐ నాగార్జున్‌రెడ్డిలు నిర్వాహకులను ఆదేశించారు. పోలీసు స్టేషన్‌లో శనివారం నిర్వాహకులతో సమావేశమయ్యారు. వారు మాట్లాడుతూ వినాయకచవితి నిర్వాహకులు మండపం వద్ద పోలీసులు ఇచ్చిన క్యూఆర్ కోడ్‌ను ఉంచాలని అన్నారు. మండపాల వద్ద భారీ శబ్దాలు వచ్చేలా పాటలు పెట్టరాదని అన్నారు. పోలీసుల సూచన మేరకు ప్రశాంతంగా వినాయక పర్వదినాన్ని నిర్వహించుకోవాలని సూచించారు.

మిడుతూరు: మిడుతూరు మండలంలోని గ్రామాల్లో గణేష్ ఉత్సవాలు ప్రజలు శాంతియుతంగా జరుపుకోవాలని ఎస్ఐ ఓబులేసు సూచించారు. మండలంలోని వివిధ గ్రామాల్లో వినాయక ఉత్సవాల కమిటీ సభ్యులతో శనివారం సమీక్ష సమావేశం ఎస్ఐ నిర్వహించారు. కార్యక్రమంలో ఏఎస్ఐలు హరిప్రసాద్, సుబ్బయ్య, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

సర్వేను వేగవంతం చేయండి

గడివేముల, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): స్వామిత్వ సర్వేను వేగవంతం చేయాలని డివిజనల్ డెవలప్‌మెంట్ అధికారి శివారెడ్డి అన్నారు. మండలంలోని గడిగరేవుల గ్రామంలో స్వామిత్వ సర్వే కార్యక్రమాన్ని తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ గ్రామస్తులు పంచాయతీ సిబ్బందికి సహకరించాలని అన్నారు. ఈనెల చివరి లోపు స్వామిత్వ సర్వేను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం గ్రా మంలో స్వచ్ఛంద్ర స్వర్ణంద్ర కార్యక్రమం నిర్వహించారు. ప్రజలకు సూర్య ఘర్‌యోజన గురించి వివరించారు. ఎంపీడీవో వాసుదేవగుప్త, డిప్యూటీ ఎంపీడీవో మహిధర్‌రెడ్డి, సర్పంచ్ బీఎస్ రామ్మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

చెంచుల జీవనోపాధికి పాటుపడుతా..

వెలుగోడు 23 (ఆంధ్రజ్యోతి) : ఐటీడీఏ పరిధిలోని చెంచు గూడేల అభివృద్ధికి వారి జీవనోపాధికి పాటు పడుతానని ఐటీడీఏ పీవో శివప్రసాద్ అన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ చెంచుల జీవనోపాధి కోసం బిస్కెట్ల తయారీ, అగరుబత్తీలు, తాటాకు దండలు, బ్యాగుల తయారీపై శిక్షణ ఇస్తామన్నారు. చెంచుల దోమల బారిన పడకుండా దోమ తెరలు, టార్పాలిన్ పట్టాలను అందిస్తామన్నారు. వెలుగు ఏపీడీ నాయక్ తహసీల్దార్ శ్రీనివాస గౌడ్, ఎంపీడీవో మధసూదన్‌రెడ్డి, అధికారులు పాల్గొన్నారు.


సీఎం చంద్రబాబు నాయుడు చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న మహిళలు, ఎమ్మెల్యే గిత్తా జయసూర్య, మాండ్ర శివానందరెడ్డి


సమావేశానికి హాజరైన మహిళలు

సూపర్‌సిక్స్ సూపర్‌హిట్

- మహిళలకు సమాజంలో సమాన గౌరవం తీసుకొచ్చిన పార్టీ టీడీపీ
- ఎమ్మెల్యే గిత్తా జయసూర్య, మాండ్ర శివానందరెడ్డి

నందికొట్కూరు, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాలు అమలులో సూపర్ హిట్ అయ్యాయని ఎమ్మెల్యే గిత్తా జయసూర్య, టీడీపీ లోక్‌సభ నియోజకవర్గ ఇన్‌చార్జీ మాండ్ర శివానంద రెడ్డి అన్నారు. శనివారం నందికొట్కూరు పట్టణంలో ఎస్ఎస్‌ఫంక్షన్ హాలులో స్త్రీ శక్తి పథకం విజయోత్సవ సభను ఆర్‌టీసీ అధికారులు నిర్వహించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఎమ్మెల్యే, మాండ్ర శివానందరెడ్డి మాట్లాడుతూ బస్సులో ఎక్కిన ప్రతి మహిళలకు జీరో ఫేర్ టికెట్లు జారీ చేయబడతాయన్నారు. నందికొట్కూరు నుంచి కర్నూలుకు వెళ్లి అక్కడ చదువుకునే విద్యార్థినులు, ప్రైవేట్ ఉద్యోగాలు చేసే వారికి ఈ పథకం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఈ పథకం ద్వారా ప్రతి మహిళకు రూ.2 వేల నుంచి 3 వేల వరకు నెలకు ఆదా అవుతుందన్నారు. నందికొట్కూరు డిపోలో శుక్రవారం ఒక్క రోజునే 62 బస్సుల్లో 21,600 మంది ప్రయాణం చేయగా అందులో 12,500 మంది మహిళలు ఉన్నారన్నారు. రాష్ట్రంలోని ఆర్టీసీలో మొత్తం 11,449 బస్సులు ఉండగా 8,458 బస్సుల్లో ఉచిత ప్రయాణానికి వినియోగిస్తున్నారన్నారు. ఇందు కోసం ప్రభుత్వంపై ప్రతిన ఎల రూ.162 కోట్లు చొప్పున ఏడాదికి రూ.1,942 కోట్లు భారం పడుతోందన్నారు. ఈ ప్రయాణ ఖర్చు మొత్తాన్ని రాష్ట్ర ప్రభుత్వమే భరించి ఏపీ ఎస్ఆర్టీసీకి చెల్లిస్తుందన్నారు. ఉచిత బస్సు ప్రయాణాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోని వారి ఆర్థికాభివృద్ధికి బాటలు వేసుకోవాలని వారు సూచించారు. కార్యక్రమంలో టీడీపీ నందికొట్కూరు నియోజకవర్గ పరిశీలకులు దేవళ్ల మురళి, మార్కెట్ యార్డు చైర్మన్ వీరం ప్రసాద్‌రెడ్డి, బీజేపీ నాయకులు దామోదర్‌రెడ్డి, జనసేన నాయకులు నల్లమల రవికుమార్, కౌన్సిలర్లు జాకీర్ హుస్సేన్, నందికొట్కూరు సహకార సొసైటీ చైర్మన్ ముర్తుజావళి, టీడీపీ మహిళా నాయకులు మీనాక్షిదేవి, లక్ష్మీప్రసన్న, డా.వనజ, ఆర్టీసీ డిపో మేనేజర్ శశిభూషన్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి

ప్రతి ఒక్కరు తమ ఇంటితో పాటు పరిసరాలను కూడా పరిశుభ్రంగా ఉంచుకొని తమ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని ఎమ్మెల్యే గిత్తా జయసూర్య, టీడీపీ లోక్‌సభ నియోజకవర్గ ఇంచార్జీ మాండ్ర శివానంద రెడ్డిలు పట్టణ ప్రజలకు సూచించారు. శనివారం నందికొట్కూరు పట్టణంలోని ఎస్.ఎస్ ఫంక్షన్ హాలు సమీపంలో జరిగిన స్వచ్ఛఆంధ్ర-స్వచ్ఛదివాస్ కార్యక్రమాన్ని మున్సిపల్ కమీషనర్ బేబి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఎమ్మెల్యే గిత్తా జయసూర్య, మాండ్ర శివానందరెడ్డి మాట్లాడుతూ ప్రతి ఒక్కరు ఇంటిని ఎలా శుభ్రం చేసుకుంటారో అలాగే తమ చుట్టూ ఉన్న పరిసరాలను కూడా శుభ్రంగా ఉంచుకోవాలని వారు సూచించారు. కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకులు దేవళ్ల మురళీ, నందికొట్కూరు మార్కెట్ యార్డుచైర్మన్ వీరం ప్రసాద్‌రెడ్డి, సొసైటీ చైర్మన్ ముర్తుజావలి, మాండ్ర సురేంద్రనాథ్‌రెడ్డి, మున్సిపల్ కమీషనర్ బేబి, అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

● అన్ని పథకాలు అందుతున్నాయి



ఉచిత బస్సు ప్రయాణం వల్ల వ్యాపారం, చదువుకునే మహిళలకు, ఉద్యోగాలు చేసే వారికి ఎంతగానో ఉపయోగపడుతోంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నాకు ఉచితగ్యాస్ సిలిండర్లు, అన్నదాత సుఖీభవన, ఉచితబస్సు ప్రయాణం చేస్తున్నాం. కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు అన్ని మాకు అందుతున్నాయి.

- నజీరాబీ, మిడ్తూరు మండలం

పాలు తెచ్చి రుణం తీర్చుకుంటున్నా



డ్వాక్రా గ్రూపు రుణం రూ.5 లక్షలు తీసుకొని గేదెలను పెంచుతూ పాడితో జీవనం సాగిస్తున్నాను. నాకు ఇద్దరు పిల్లలు వారికి తల్లికి వందనం డబ్బులు వచ్చాయి. అన్నదాత సుఖీభవ మొదటి విడత కింద రూ.7 వేలు, పంట బీమా ఇన్సూరెన్స్ వచ్చాయి. తాను పొదుపుద్వారా తీసుకున్న గేదెల పాలతోనే నేడు చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం చేసి రుణం తీసుకునే అవకాశం కలగడం సంతోషంగా ఉంది.

భాగ్యమ్మ, నాగటూరు, నందికొట్కూరు మండలం

రూ. 600 ఆదా అయ్యాయి



ఆగస్టు 15న మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అందుబాటులోకి తీసుకురావడంతో మరో సారి స్వాతంత్ర్యం వచ్చింది. ఈనెల 16వ తేదీన నందికొట్కూరు నుంచి నా కుటుంబ సభ్యులతో కలిసి ఆదోనికి వెళ్లి వచ్చాను. తద్వారా రూ.600 ఆదా అయ్యాయి.

- వేదవతి, నందికొట్కూరు పట్టణం

ప్రకాశం పంతులు సేవలు మరువలేనివి


ఆత్మకూరులో ప్రకాశం పంతులు చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న దృశ్యం


ప్రకాశంపంతులు చిత్రపటానికి పూలమాలవేసి నివాళి అర్పిస్తున్న సమాఖ్య నిర్వాహకులు, కవులు, రచయతలు, సాహితీ సంస్థల సభ్యులు

ఆత్మకూరు, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): ఆంధ్రరాష్ట్ర తొలిముఖ్యమంత్రి ప్రకాశం పంతులు రాష్ట్రానికి చేసిన సేవలు మరువలేనివని ఆత్మకూరు రైతు సంఘం గౌరవాధ్యక్షులు మోమిన్ మునీర్‌బాషా, అధ్యక్షులు బైరాపురం రహంతుల్లా, పేర్కొన్నారు. శనివారం టంగుటూరి ప్రకాశం పంతులు 153వ జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో రౌతు సంఘం నాయకులు మహెబూబ్‌బాషా, నబీసాహేబ్, బాబు, ఇబ్రహీం, సుబ్బరాయుడు, యూసూఫ్, అక్బరుద్దిన్ తదితరులు ఉన్నారు.

నంద్యాల కల్చరల్: టంగుటూరి ప్రకాశం పంతులు 154వ జయంతి కార్యక్రమాన్ని నంది రైతు సమాఖ్య కార్యాలయంలో శనివారం సమాఖ్య గౌరవసలహాదారులు, విశ్రాంత శాస్త్రవేత్త డాక్టర్ రవీంద్రనాద్ అధ్యకతన ఘనంగా నిర్వహించారు. నంది రైతు సమాఖ్య నిర్వాహకులు, వివిధ సాహితీ సంస్థల ప్రతినిధులు ప్రకాశం పంతులు చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళి అర్పించారు. అనంతరం వక్తలు మాట్లాడుతూ నంద్యాల గాంధీచౌక్‌లోని కూరగాయల మార్కెట్‌కు ప్రకాశం పంతులు పేరు పెట్టాలని సూచించారు. కార్యక్రమంలో ప్రముఖ వాగ్వసంత డాక్టర్ దివి హయగ్రీవాచార్యులు, డాక్టర్ గెలివి సహదేవుడు, డాక్టర్ కిషోర్‌కుమార్, సమాఖ్య ప్రతినిధులు, కవులు, రచయతలు ప్రకాశం పంతులు జీవిత విశేషాలపై కవితలు, ఆంధ్రకేసరి జీవిత విశేషాలను వివరించారు.

పరిసరాల శుభ్రతతోనే ఆరోగ్యం పదిలం


వడ్లరామాపురంలో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఎంపీడీవో సయ్యద్ ఉమ్మర్


బండిఆత్మకూరులో ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు

ఆత్మకూరురూరల్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం పదిలంగా ఉంటుందని ఎంపీడీవో సయ్యద్ ఉమ్మర్ పేర్కొన్నారు. శనివారం మండలంలోని వడ్లరామాపురం గ్రామంలో అధికారులతో కలిసి స్వర్ణాంధ్ర స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. అధికారులు, విద్యార్థులతో కలిసి గ్రామంలో ర్యాలీ నిర్వహించి గ్రామ కూడలిలో మానవ హారంగా ఏర్పడి స్వచ్ఛాంధ్రకు కట్టుబడి ఉంటామని ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ఎంపీడీవో మాట్లాడుతూ ప్రజలు వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత పాటించాలని అప్పుడే రోగాలు దరిచేరవని సూచించారు. కార్యక్రమంలో ఏవో హేమలత, హెల్త్ ఎడ్యుకేటర్ ధనలక్ష్మి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పాములపాడు: ప్రతివ్యక్తి వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎంపీడీవో చంద్రశేఖర్, డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ అధికారి మల్లికార్జున అన్నారు. శనివారం పాములపాడులోని స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో బాగంగా స్థానిక ఆదర్శ పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కల్గించారు.

కొత్తపల్లి: ప్రతి ఒక్కరం పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని తహసీల్దార్ ఉమారాణి, డిప్యూటీ ఎంపీడీవో సుబ్బారావు సూచించారు. శనివారం మండల కేంద్రంలో తహసీల్దార్, దుద్యాలలో డిప్యూటీ ఎంపీడీవో ఆధ్వర్యంలో స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. పరిశుభ్రతపై ర్యాలీ నిర్వహించారు.

బండిఆత్మకూరు: ప్రతి ఒక్కరూ పరిశుభ్రత పాటించాలని మండల స్పెషల్ ఆఫీసర్ అబ్దుల్ రహెమాన్ సూచించారు. శనివారం స్వచ్ఛాంధ్ర, స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా బండిఆత్మకూరులో అధికారులు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో తహసీల్దార్ పద్మావతమ్మ, ఇన్‌చార్జి ఎంపీడీవో రామకృష్ణవేణి. సర్పంచ్ సంధ్య, టీడీపీ నాయకులు అక్కిరెడ్డి, జాకీర్, కార్యదర్శి అక్బర్ పాల్గొన్నారు.

పగిడ్యాల: ప్రతి ఒక్కరు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని డిప్యూటి ఎంపీడీవో అబ్దుల్ రహిమన్ సూచించారు. స్వచ్ఛ ఆంధ్ర- స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా పగిడ్యాల ఎంపీడీవో కార్యాలయం నుంచి బస్టాండ్ ఆవరణం వరకు శనివారం ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఏపీవో మద్దిలేటి, సిబ్బంది పాల్గొన్నారు.

నంద్యాల కల్చరల్: నంద్యాల టెక్క విద్యుత్ కార్యాలయంలో నాల్గవ శనివారం సందర్భంగా నంద్యాల ఏడిఈ రామయ్య ఆధ్వర్యంలో పచ్చదనం పరిశుభ్రత కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా విద్యుత్ కార్యాలయ ప్రాంగణం లో పరిశుభ్రత కార్యక్రమం నిర్వహించి అనంతరం పచ్చదనం కోసం చెట్లను నాటారు.

కనిపించని 'స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర'

● పట్టించుకోని అధికారులు

నంద్యాల హాస్పిటల్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): నంద్యాల పట్టణంలో స్వచ్ఛాంధ్ర - స్వర్ణాంధ్ర కార్యక్రమం మొక్కుబడిగా సాగుతోందనే దానికి పై చిత్రాలే నిదర్శనం. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతి నాలుగో శనివారం స్వచ్ఛాంధ్ర - స్వర్ణాంధ్ర కార్యక్రమం తప్పనిసరిగా నిర్వహించాలనే ఆదేశాలున్నాయి. ఇందుకు అనుగుణంగా కలెక్టర్ అధికారులను కార్యక్రమం నిర్వహించాలని సూచిస్తున్నప్పటికీ మొక్కుబడిగా ఆయా కార్యాలయాల్లో స్వచ్ఛాంధ్ర - స్వర్ణాంధ్ర కార్యక్రమం నిర్వహిస్తున్నారు. శనివారం జీజీహెచ్‌లో ఆస్పత్రి సూపరింటెండెంట్ శుభ్రంగా ఉన్న రోడ్లపై చీపురు చేతపట్టి స్వచ్ఛాంధ్ర - స్వర్ణాంధ్ర కార్యక్రమాన్ని ప్రారంభించారు. అయితే జీజీహెచ్ ఆవరణలోనే దుర్గంధాన్ని తలపిస్తున్న ప్రదేశాలను ఏ మాత్రం పట్టించుకోలేదు. జీజీహెచ్‌లోని చెత్తను ఆస్పత్రి ఆవరణలో ఓ వైపు డంప్ చేస్తారు. అయితే డంప్ ఖాళీగా ఉన్నా అందులో చెత్త వేయకుండా డంప్ పక్కనే వేయడంతో డంప్‌యార్డ్‌ను తలపిస్తోంది. అంతేకాకుండా డీఎంహెచ్‌వో కార్యాలయానికి వెళ్లే దారిలో ట్యాంక్ నిండిన తర్వాత వృథాగా నీరు భవనం పక్కన చేరడంతో ఆ ప్రదేశం దుర్గంధభరితంగా మారింది. పంచాయతీరాజ్ కార్యాలయ ఆవరణలో కార్యాలయం నుంచి వస్తున్న మురుగు నీరు బయటకు ప్రవహిస్తూ ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయం ముందు నిల్వ ఉండి కార్యాలయానికి వెళ్లేందుకు సిబ్బంది, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.


డంప్‌యార్డ్‌ను తలపిస్తున్న జీజీహెచ్ ప్రాంగణం


డీఎంహెచ్‌వో కార్యాలయానికి వెళ్లే దారిలో ...

శాంతిరాంలో ఫార్మసీ గ్రాడ్యుయేషన్ డే


బి ఫార్మసీ పట్టభద్రులతో ముఖ్య అతిథులు, కళాశాల అధ్యాపకులు

పాణ్యం, ఆగస్టు 23 : (ఆంధ్రజ్యోతి): మండలంలోని శాంతిరాం పార్మసీ కళాశాలలో శనివారం సమవర్తన 2025 గ్రాడ్యుయేషన్ డే ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హైదరాబాదు ఎన్ఎంఐఎస్ డైరెక్టర్, అశ్విని ఎస్ దేశ్‌పాండే, విజయవాడ అను గ్రూప్స్ హాస్పిటల్స్ వ్యవస్థాపకులు డాక్టర్ రమేష్ గాజు పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ తల్లిదండ్రుల కృషి వల్లే ఈ స్థాయికి చేరుకున్నారని, వారికి ఎల్లప్పుడూ రుణపడి ఉండాలన్నారు. అనంతరం బీఫార్మసీ, పార్మ్‌డీ, ఎంపార్మసీ పట్టభద్రులకు పట్టాలు, పతకాలు అందజేశారు. జాతీయ స్థాయి, రాష్ట్రస్థాయిలో నిర్వహించిన పలు పోటీ పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన బిపార్మసీ విద్యార్థిని షేక్ ఆర్షియాకు రూ. 50 వేల నగదు పురస్కారాన్ని అందజేశారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ అశోక్‌కుమార్, ప్రిన్సిపాల్ డాక్టర్ మధుసూదన్ శెట్టి, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

8 మెగా వాట్ల విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ప్రారంభం


గోకవరంలో మెగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రారంభిస్తున్న ఎస్ఈ సుధాకర్, అధికారులు

కొత్తపల్లి, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): కొత్తపల్లి మండల రైతాంగానికి పగటి పూట 9 గంటల త్రీఫేస్ విద్యుత్ సౌకర్యం కల్పించేందుకు 8 మెగావాట్ల పవర్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేసినట్లు జిల్లా విద్యుత్ శాఖ ఎస్ఈ సుధాకర్ కుమార్ తెలిపారు. శనివారం ఆయన మండలంలోని గోకవరం విద్యుత్ సబ్ స్టేషన్‌లో రూ.1.10 కోట్లతో ఏర్పాటు చేసిన 8 మెగా వాట్ల ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రారంభించారు. అనంతరం ఎస్ఈ సుధాకర్ మాట్లాడుతూ గతంలో ఈ సబ్ స్టేషన్‌లో5 మెగా వాట్లు ఉండేదని, దీంతో రైతులు ఎప్పుడూ లోవోల్టేజీ సమస్యతో ఇబ్బంది పడేవారన్నారు. ఇక నుంచి గోకవరం సబ్ స్టేషన్ పరిధిలోని ఎదురుపాడు, కొక్కెరంచ నాగంపల్లి, జడ్‌వారిపల్లి, బట్వారిపల్లి, శివపురం, సింగరాజుపల్లి, పెద్దగుమ్మడాపురం, ముసలిమడుగు, చిన్నగుమ్మడాపురం, ఎర్రమటం, పి.మాడుగుల, కపిలేశ్వరం, సంగమేశ్వరం , జానాల, బలపాలతిప్ప గ్రామాలతో పాటు రైతులకు లోవోల్టేజీ సమస్య ఉండదన్నారు. కార్యక్రమంలో ఎంఆర్‌సీఈఈ శ్రీరాములు, ఎంఆర్‌పీ డీఈఈ గురులింగాచారి, ఆపరేషన్ ఈఈ జయశంకర్, డీఈఈ రామసుబ్రహ్మన్యం, ఏఈ అబీద్ పాల్గొన్నారు.

'ఉమ్మీద్'పై అవగాహన సదస్సు

రాష్ట్ర వక్ఫ్ బోర్డు చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ మహ్మద్ అలీ


మాట్లాడుతున్న మహ్మద్ అలీ

నంద్యాల రూరల్ ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): నంద్యాల జిల్లా సెంటినర్ హాల్లో ఉమ్మీద్‌పై అవగాహన సదస్సు శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర వక్ఫ్ బోర్డు చిఫ్ ఎగ్జిక్యూటివ్ అధికారి మహ్మద్ అలీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమ్మీద్ పోర్టల్‌లో వివరాలు నమోదు చేయడం ద్వారా చాలా ఉపయోగకరంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఉమ్మడి కర్నూలు జిల్లాల నుంచి సుమారుగా 300 మంది మత పెద్దలు పాల్గొని విజయవంతం చేశారని అన్నారు. కార్యక్రమంలో సభ్యులు నషీర్, వక్ఫ్‌బోర్డు ఇన్‌స్పెక్టర్ ఇమ్రాన్, సోహైల్, ఖుద్దుస్, బాషా తదితరులు పాల్గొన్నారు.

ఇంటిపై దాడి.. 20 మందిపై కేసు

మిడుతూరు, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): అప్పు చెల్లించాలని కోరిన ఓ మహిళ ఇంటిపై దాడి చేసి తలుపులు ధ్వంసం చేశారు. ఈ ఘటనలో 20 మందిపై కేసు నమోదు చేశారు. మండలంలోని బైరాపురం గ్రామానికి చెందిన ఖాజాబీకి అదే గ్రామానికి చెందిన షబాన సుమారు రూ.5 లక్షలు అప్పు ఉంది. అప్పు చెల్లించాలని షబానాను ఖాజాబీకి శుక్రవారం అడిగారు. దీంతో షబాన నంద్యాల నుంచి తన బంధువులు 19 మందిని పిలిపించి ఖాజాబీ ఇంట్లో ఎవరూ లేని సమయంలో వారు ఇంటి తలుపులను శుక్రవారం రాత్రి ధ్వంసం చేశారు. ఖాజాబీ శనివారం ఫిర్యాదు చేయడంతో షబానాతో పాటు ఆమె బంధువులపై కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఓబులేసు తెలిపారు.

డోన్

డోన్, ఆళ్లగడ్డ, బనగానపల్లె

సొసైటీల అభివృద్ధే లక్ష్యం: డీసీవో

ఉయ్యాలవాడ, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలను అభివృద్ధి చేయడమే లక్ష్యమని జిల్లా కోఆపరేటివ్ అధికారి రామాంజనేయులు అన్నారు. శనివారం పెద్దయమ్మనూరు గ్రామ సొసైటీని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో 56 వ్యవసాయ పరపతి సంఘాలు ఉన్నాయన్నారు. వీటికి ఇటీవల అధ్యక్షులను నియమించామన్నారు. సొసైటీలను పీడీసీ ద్వారా ఆధునీకరించటానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. అలాగే రైతులకు కేవలం నాలుగు శాతం వడ్డీతో బంగారు, హౌసింగ్, వాహనాల కొనుగోలుకు రుణాలు అందిస్తామన్నారు. సొసైటీల్లో రైతుల భాగస్వామ్యాన్ని పెంచాలని సిబ్బందికి సూచించారు. అనంతరం పెద్దయమ్మనూరు గ్రామంలో సొసైటీ భవన నిర్మాణానికి దాతలు ఇచ్చిన స్థలాన్ని ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో పెద్దయమ్మనూరు సొసైటీ సీఈవో సుబ్రమణ్యం, కమిటీ సభ్యులు రామసుబ్బయ్య, రామచంద్రుడు తదితులు ఉన్నారు.

రహదారుల పరిశీలన

చాగలమర్రి, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని డి.వనిపెంట, కొత్తపల్లె, ఓజీ తండా గ్రామాల రహదారులను పీఆర్ ఎస్ఈ నాగరాజు శనివారం పరిశీలించారు. నీటి కుంటలా రహదారులు అన్న శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో కథనం ప్రచురితమైంది. స్పందించిన ఎస్ఈ ఆయా గ్రామాల రహదారులను, వంకలను పరిశీలించారు. దెబ్బతిన్న రహదారులు, వంతెన మరమ్మతులు చేయించేందుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు చేస్తున్నామని తెలిపారు. ఆయన వెంట పీఆర్ అధికారులు ఉన్నారు.

ఆర్టీసీ బస్టాండ్‌లో రోడ్డు మరమ్మతులు

చాగలమర్రి, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): చాగలమర్రి గ్రామంలోని ఆర్టీసీ బస్టాండు ప్రాంగణంలో నీటి కుంటల మరమ్మతులకు ఎక్స్‌కవేటర్‌తో పనులు చేపట్టారు. నీటి కుంటలా బస్టాండు అన్న శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైంది. స్పందించిన జిల్లా ఆర్ఎం రజియా సుల్తానా ఆదేశాలతో శనివారం సంబంధిత అధికారులు ఎక్స్‌కవేటర్‌తో మరమ్మతులు పనులు చేపట్టారు. బస్టాండులోకి బస్సులు వచ్చేందుకు గ్రావెల్‌తో రోడ్లు వేసి రాకపోకలు చేసేందుకు చర్యలు తీసుకున్నారు. ప్రయాణికుల కోసం మరుగుదొడ్లు, తాగునీటి సమస్య పరిష్కారానికి ట్యాంకులు ఏర్పాటు చేశారు. మరమ్మతు పనులు వేగవంతం చేసి ప్రయాణికులకు సౌకర్యం కల్పిస్తామని సూపరింటెండెంట్ శ్రీనివాసులు తెలిపారు.

దివ్యాంగులు ఆత్మస్థైర్యంతో ముందుకెళ్లాలి

చాగలమర్రి, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగ విద్యార్థులు ఆత్మస్థైర్యంతో ముందుకెళ్లాలని జిల్లా సర్వశిక్షఅభియాన్ ఎంఐఎస్ అధికారి జగన్‌మోహన్‌రెడ్డి తెలిపారు. శనివారం చాగలమర్రిలోని భవిత కేంద్రం, ఉర్దూ, మెయిన్ ప్రాథమిక పాఠశాలలను తనిఖీ చేశారు. అలెక్సోకో అధికారి ప్రసన్నకుమార్, ఎఫ్ఏవో శ్రీని వాసులు కలిసి విద్యార్థుల సమస్యలను తెలుసుకున్నారు. సర్వేపల్లి రాధాకృష్ణ విద్యామిత్ర కిట్లను, మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. దివ్యాంగ విద్యార్థులు ఫిజియోథెరపి వైద్య పరీక్షలు చేయించు కోవాలని, విద్యలో రాణించాలని సూచించారు. ఎంఈవోలు అనూరాధ, న్యామతుల్ల, హెచ్‌ఎంలు శేషాద్రి, మాబుహూ సేన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

డీఎస్సీలో ప్రతిభ

ఆంధ్రజ్యోతి నెట్‌వర్క్: రాష్ట్ర ప్రభుత్వం శనివారం విడుదల చేసిన డీఎస్సీ ఫలితాల్లో పలువురు నిరుద్యోగులు ప్రతిభ చాటారు. ర్యాంకులు సాధించిన అభ్యర్థుల్లో ఆనందం వెల్లివిరిసింది.

సంతోషంగా ఉంది



భర్త ఇండి యన్ ఆర్మీలో పనిచేస్తున్నారు. గృహిణిగా ఉంటూ కష్టపడి చదివా. ఎస్‌జీటీ పరీక్షలో 85.10మార్కులతో జిల్లాలో 253వ ర్యాంకు సాధించా. ప్రభుత్వ ఉద్యోగం రావడం ఎంతో ఆనందంగా ఉంది.

● గురులక్ష్మి, తుడుమలదిన్నె, ఉయ్యాలవాడ

కష్టపడి చదివి..



పేద కుటుంబంలో పుట్టినప్పటికీ కష్టపడి చదివా. తల్లిదండ్రులు యల్లయ్య, మరియమ్మ కూలీ పనులు చేస్తారు. డీఎస్సీ ఫలితాల్లో ఎస్‌జీటీ ర్యాంకు 157 ఓపెన్ కేటగిరిలో సాధించా. నంద్యాల డిస్ట్రిక్ట్‌లో మార్కులు 86.39401 సాధించా.

● పెరుమాళ్ల శివ, కోవెలకుంట్ల

ఎలాంటి కోచింగ్ లేకుండానే..



ఎలాంటి కోచింగ్ లేకుండానే సాధన చేసి ర్యాంకు సాధించా. స్కూల్ అసిస్టెంట్ సోషల్ పరీక్షలో జిల్లాస్థాయిలో 10వ ర్యాంకు, తెలుగులో 102వ ర్యాంకు, ఎస్‌జీటీలో 90 ర్యాంకు సాధించా.

● సుమలత, ఊటకొండ, ప్యాపిలి

సామాన్యుల ప్రతిభ





కొలిమిగుండ్ల మండలం గొర్విమానుపల్లెకు చెందిన కొండయ్య వరలక్ష్మీ దంపతుల కుమార్తె మంజుల(ఎస్‌జీటీ) ఉమ్మడి కర్నూలు జిల్లాలో 8వ ర్యాంకు సాధించి సత్తా చాటింది. పేట్నీకోటకు చెందిన రైతు బిడ్డ సాంబశివారెడ్డి పిజికల్ డైరెక్టర్ విభాగంలో 23వ ర్యాంకు సాధించాడు.

- మంజుల, గొర్విమానుపల్లె, సాంబశివారెడ్డి పేట్నీకోట, కొలిమిగుండ్ల

ప్రభుత్వ భూమి ఆక్రమణ

• చదును చేసిన వ్యక్తి • పరిశీలించి వెనుదిరిగిన అధికారి



ప్రభుత్వ భూమిని చదను చేస్తున్న ఎక్స్‌కవేటర్

రుద్రవరం, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ భూములకు రక్షణ కరువైంది. రోజురోజుకూ ఆక్రమణకు గురికావడం పరిపాటిగా మారింది. ప్రజాప్రయోజనాల నిమిత్తం ఉపయోగించాల్సిన ప్రభుత్వ భూములు ఇలా ఆక్రమణకు గురవుతున్నా పట్టించుకోకపోవడంతో రెవెన్యూ అధికారులపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అధికారులు మాత్రం తమకేమీ తెలియనట్లు వ్యవహరించడంలో ఆంతర్యమేమిటోనని చర్చించుకుంటున్నారు. రుద్రవరం మండలం కోటకొండ రెవెన్యూ పరిధిలో విలువైన ప్రభుత్వ భూమిని ఓ వ్యక్తి కబ్జా చేసి చదును చేశాడు. విషయం తెలిసిన రెవెన్యూ అధికారి అక్కడి వెళ్లి వెనుదిరిగి రావడంతో పలు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఓ అధికారి అక్కడేం జరుగుతున్నా పట్టించుకోవద్దని ఆదేశించినట్లు సమాచారం. ప్రభుత్వ భూమి కాపాడాల్సిన అధికారులే ఇలా వ్యవహరించడం గ్రామంలో పలు అనుమానాలకు తావు ఇస్తోంది.

పనులు నిలిపివేశాం

గ్రామంలో ప్రభుత్వ భూమిని ఆక్రమించి చదును చేస్తున్న పనులను నిలిపివేశాం. ఆధారాలు ఉంటే తీసుకురమ్మని సూచించాం. విషయాన్ని తహసీల్దారు దృష్టికి తీసుకెళ్లాం. ఆధారాలను బట్టి తదుపరి చర్యలు ఉంటాయి.

● చంద్రశేఖరయ్య, డీటీ, రుద్రవరం

అధ్వానంగా క్రీడా ప్రాంగణం

● కూటమి ప్రభుత్వంలో అయినా పూర్వవైభవం వచ్చేనా?

కోవెలకుంట్ల, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): ఒకప్పుడు సభలు, సమావేశాలతో నిత్యం కళకళలాడే నందమూరి తారక రామారావు క్రీడా ప్రాంగణం గత వైసీపీ ప్రభుత్వంలో శిథిలావస్థకు చేరింది. ఈ క్రీడా ప్రాంగణంలో చెత్తకుప్పలు వేయడం, మూత్ర విసర్జన చేస్తుండడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఇదెక్కడో కాదు.. కోవెలకుంట్ల మేజరు గ్రామ పంచాయతీలోని షాపింగ్ కాంప్లెక్స్ మధ్యలో ఉన్న నారా చంద్రబాబు నాయుడు ఇండోర్ స్టేడియం ముందున్న క్రీడా ప్రాంగణంలోనే.. గత టీడీపీ హయాంలో ఈ క్రీడా ప్రాంగణంలో సభలు సమావేశాలు నిత్యం జరుగుతుండేవి. ఈ క్రీడా ప్రాంగణం పట్టణ నడిబొడ్డున ఉండడంతో ప్రజలకు అనువుగా ఉండేది. అయితే వైసీపీ ప్రభుత్వంలో నాయకులు అధికారులు నిర్లక్ష్య ధోరనితో వ్యవహరించడంతో క్రీడాప్రాంగణం శిథిలావస్థకు చేరింది. ప్రస్తుతం క్రీడా ప్రాంగణానికి వెళ్లే ముఖ ద్వారం వద్ద చెత్తకుప్పలు వేయడంతో దుర్వాసన వెదజల్లుతోంది. అంతేకాక షాపింగ్ కాంప్లెక్స్ వెనుక భాగాన కొందరు మూత్రవిసర్జన చేస్తుండడం, మద్యం తాగిన సీసాలు అక్కడ పగులగొట్టడం నిత్యం జరుగుతోంది. దీనికి తోడు అక్కడ వాహనాలను నిలపడంతో క్రీడాప్రాం గణమం టతా బురదమయంగా మారి ప్రజలకు ఇబ్బందికరంగా తయారైంది. కాగా రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి కోవెకులంట్ల మండలానికి రెండు కుట్టుమిషన్ కేంద్రాలను ఏర్పాటు చేసి మహిళలకు శిక్షణ ఇప్పిస్తున్నారు. అందులో ఒక కుట్టు మిషను శిక్షణ కేంద్రం ఇండోర్ స్టేడియంలో నిర్మింస్తుండడంతో నిత్యం మహిళలు ఉదయం సాయంత్రం ఇక్కడికి వస్తుంటారు. దీంతో మహిళలు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఇండోర్ స్టేడియం నందమూరి తారకరామారావు క్రీడా ప్రాంగణంలో చెత్తను, మురుగును ఎత్తివేయించి అక్కడ మూత్ర విసర్జన చేయకుండా చర్యలు చేపట్టి క్రీడాప్రాంగణం సభలు సమావేశాలకు అనువుగా తయారు చేయాలని ప్రజలు కోరుతున్నారు.



ఇండోర్ స్టేడియంలోకి వెళ్లే ముఖద్వారం



మైదానంలో వేసిన చెత్త

ఘనంగా శ్రీకృష్ణుడి గ్రామోత్సవం



ఏనుగమర్రిలో కోలాటం ఆడుతున్న కోట్ల సుజాతమ్మ



పూజల్లో పాల్గొన్న జడ్పీ చైర్మన్ , మాజీ ఎమ్మెల్యే

ప్యాపిలి, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఏనుగమర్రి గ్రామంలో శ్రీకృష్ణుడి విగ్రహ గ్రామోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. త్రైత సిద్ధాంత ప్రబోధానంద సేవా సమితి ఇందూ జ్ఞానవేదిక ఆధ్వర్యంలో ఊరేగింపు నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ కోలాటం ఆడారు. కార్యక్రమంలో సమితి సభ్యులు, కృష్ణుడి భక్తులు పాల్గొన్నారు.

● బందార్లపల్లె శ్రీకృష్ణుడి పల్లకీ ఉత్సవం

కొలిమిగుండ్ల : మండలంలోని బందార్లపల్లెలో త్రైతసిద్ధాంతం, ప్రబోధ సేవాసమితి ఇందూ జ్ఞానవేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన శ్రీకృష్ణ పరమాత్మ పల్లకీ ఉత్సవంలో ఉమ్మడి జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి పాల్గొన్నారు. ముందుగా స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రబోధ సేవాసమితి సభ్యులను అభినందించారు. సాంస్కృతిక కార్యక్రమాలు, గీతా బోధనలు భక్తులను అలరించాయి. కార్యక్రమంలో స్థానిక సభ్యులు రాజా, రామకృష్ణ, నాగసుబ్బరాయుడు, శీను, మల్లి, మండల కమిటీ సభ్యులు పీఎంహెచ్ నాయుడు, రామకృష్ణారెడ్డి, వివిధ గ్రామాల భక్తులు పాల్గొన్నారు.

గణేశ్ ఉత్సవాలు ప్రశాంతంగా జరుపుకోవాలి

● సమావేశంలో డీఎస్పీ ప్రమోద్



మాట్లాడుతున్న డీఎస్పీ ప్రమోద్

ఆళ్లగడ్డ, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): ఆళ్లగడ్డ సబ్‌డివిజన్ పరిధిలో గణేశ్ ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలని డీఎస్పీ ప్రమోద్ సూచించారు. శనివారం పట్టణంలోని అమ్మవారిశాలలో గణేశ్ ఉత్సవ కమిటీ నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. డీఎస్పీ మాట్లాడుతూ పట్టణంలో ఉత్సవాలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకునేందుకు కమిటీ సభ్యులు సహకరించాలన్నారు. మండపాల వద్ద అశ్లీల నృత్యాలు, డీజేలు, ఈవ్‌టీజింగ్ లాంటి వాటికి పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. పట్టణంలో ఈనెల 31న జరగనున్న గణేశ్ నిమజ్జనం ఊరేగింపు ఉదయం 10 గంటల నుంచి ప్రారంభమై రాత్రి పది గంటల లోపు పూర్తి కావాలని గణేష్ కేంద్ర కమిటీ తీర్మానించారు. సమావేశంలో గణేశ్ కమిటీ గౌరవ అధ్యక్షుడు టీఎంసీ వేణుగోపాల్, న్యాయవాది నిలకంతేశ్వరం, మధు, మున్సిపల్ కమిషనర్ కిశోర్, తహసీల్దార్ జ్యోతి రత్నకుమారి, సీఐ యుగంధర్, ఎంపీడీవో నూర్జహన్, విద్యుత్ శాఖ ఏఈ క్రిష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

పోలీసు అనుమతి తీసుకోవాలి: సీఐ

బనగానపల్లె: పట్టణంలో వినాయక విగ్రహాలు ఏర్పాటు చేసుకునే వారు పోలీసుల ముందస్తు అనుమతి తీసుకోవాలని బనగానపల్లె సీఐ ప్రవీణ్‌కుమార్ కోరారు. శనివారం ఆయన మాట్లాడుతూ బనగానపల్లె పట్టణం, మండల వ్యాప్తంగా మండపం వద్ద పాటించాల్సిన నియమ నిబంధనలను వివరించారు. అవాంఛనీయ ఘటనలు జరుగకుండా కమిటీ సభ్యులు జాగ్రత్తలు తీసుకోవాలని సీఐ కోరారు. ఎంపీడీవో కార్యాలయంలోని పొదుపు భవనంలో ఉత్సవ కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సూచనలు, సలహాలు ఇచ్చారు. సమావేశంలో గణేశ్ ఉత్సవ కమిటీ గౌరవ సలహాదారులు టంగుటూరు శ్రీనయ్య, గాదంశెట్టి వేణుగోపాల్, మల్లారెడ్డి, సీఐ మంజు నాథ రెడ్డి, ఎస్ఐ దుగ్గిరెడ్డి, సాయిరాం, నాగేశ్‌బాబు, సభ్యులు, పాల్గొన్నారు.

దద్దనాల ప్రాజెక్టు పరిశీలన

మండలంలోని దద్దనాల ప్రాజెక్టును వద్ద నిర్వహించనున్న నిమజ్జనానికి సంబంధించిన ఏర్పాట్లను బనగానపల్లె సీఐ ప్రవీణ్‌కుమార్, ఎస్ఐ దుగ్గిరెడ్డి శనివారం పరిశీలించారు. నిమజ్జనానికి కావాల్సిన పరికరాలు, భక్తుల వసతులపై చర్చించారు. కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కొలిమిగుండ్ల : మండలంలోని వివిధ గ్రామాల గణేశ్ ఉత్సవాల ఏర్పాట్లపై ఆర్ఎస్ఎస్, విశ్వహిందూ పరిషత్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా సీఐ మద్దినేని రమేష్‌బాబు, గణేష్ ఉత్సవ కమిటీ జిల్లా కార్యదర్శి నర్ల మహేష్‌రెడ్డి, ఆర్ఎస్ఎస్ జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు హాజరయ్యారు. వినాయక మండపాల ఏర్పాట్లు, నిమజ్జనంపై సమీక్షించారు. సమావేశంలో అంబటి చంద్రశేఖరరెడ్డి, రాముడు నాయక్, భవాణి, మహేష్‌శర్మ, లక్ష్మమయ్య, రామ్మోహన్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ప్రజల భాగస్వామ్యంతోనే స్వచ్ఛత సాధ్యం : జేసీ



ర్యాలీలో పాల్గొన్న జేసీ విష్ణు చరణ్

శిరివెళ్ల, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి) : ప్రజలందరి భాగస్వామ్యంతోనే స్వచ్ఛత సాధ్యమవుతుందని జాయింట్ కలెక్టర్ విష్ణు చరణ్ అన్నారు. స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రమైన శిరివెళ్లలో సచివాలయం-1 నుంచి నిర్వహించిన ర్యాలీలో జేసీ పాల్గొన్నారు. అత్యంత శుభ్రమైన రాష్ట్రంగా ఏపీని తీరిదిద్దాలన్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు లక్ష్యాన్ని నెరవేర్చేందుకు ప్రజలు, అధికారులు, ప్రజాప్రతినిధులు బాధ్యతగా వ్యవహరించాలన్నారు. సామాజిక బాధ్యతగా వ్యక్తిగత పరిశుభ్రత, పర్యావరణ పరిరక్షణ చేస్తూ ఇతరులకు స్ఫూర్తిగా ఉంటామని అందరిచే స్వచ్ఛ ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో డీపీవో లలితాబాయి, తహసీల్దార్ విజయశ్రీ, డిప్యూటీ ఎంపీడీవో శ్రీనివాసశర్మ, పంచాయతీ కార్యదర్శి అశ్విన్ కుమార్, సర్పంచ్ లక్కాకుల సాలమ్మ, మాజీ జడ్పీటీసీ యామా గుర్రప్ప, గ్రామ పెద్దలు బీసీ ఫిదా హుసేన్, ఉల్లి వెంకట సుబ్బయ్య, కొత్తపేట జిక్రియా, అబూ బకర్ సిద్ధిఖ్, బీఎండీ రఫి, నాగ లింగమయ్య, పసుల నరేంద్ర, చాంద్ బాషా, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

జాబ్ మేళాకు విశేష స్పందన

ఆళ్లగడ్డ, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కేవీ సుబ్బారెడ్డి డిగ్రీ కళాశాలలో ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ ఆధ్వర్యంలో రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ శనివారం నిర్వహించిన జాబ్ మేళాకు విశేష స్పందన లభించింది. జాబ్ మేళాకు ముఖ్య అతిథులుగా కళాశాల ప్రిన్సిపాల్ భూమా శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి శ్రీకాంత్‌రెడ్డి హాజరయ్యారు. వివిధ ప్రాంతాల నుంచి పది ప్రైవేటు కంపెనీల ప్రతినిధులు పాల్గొని నిరుద్యోగులకు ఇంటర్వ్యూలు నిర్వహిం చారు. ఆయా గ్రామాల నుంచి సుమారు 300 మందికి పైగా నిరు ద్యో గులు పాల్గొనగా ప్రతిభ కనపరిచిన 134మందిని ఎంపిక చేసినట్లు జిల్లా నైపుణాభివృద్ధి సంస్థ అధికారి శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో ఏపీఎస్‌డీసీ, ఎస్ఈఈడీఏపీ, ఉద్యోగ సిబ్బంది పాల్గొన్నారు.

ఆంజనేయస్వామికి అమావాస్య పూజలు

కొలిమిగుండ్ల, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బెలుం, కొలిమిగుండ్ల, అంకిరెడ్డిపల్లె, మీర్జాపురం తదితర గ్రామాల్లో ఆంజనేయ స్వామికి శ్రావణమాసం శనివారం అమావాస్య పూజలను ఘనంగా నిర్వహించారు. బెలుంలో ఆలయ ప్రధాన అర్చకులు మహేష్‌శర్మ స్వామి వారికి ఆకుపూజ, పంచామృతాభిషేకం, విశేష పూజలు నిర్వహించి, ప్రత్యేక అలంకరణ చేపట్టారు. కొలిమిగుండ్ల కొండపై వెలసిన కాళభైరవుడికి అమావాస్య సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు.

మెనూ ప్రకారం భోజనం అందించాలి

బేతంచెర్ల, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): కస్తూర్బా పాఠశాలలో విద్యా ర్థినులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని నగర పంచాయతి ప్రత్యేక అధికారి మెహరున్నీసాబేగం, మిషనర్ హరి ప్రసాద్ సూచించారు. శనివారం బేతంచెర్ల నగర పంచాయతీ పరిధిలోని కస్తూర్బా పాఠశాలను వారు తనిఖీ చేశారు. వంటశాలను, నీటి ట్యాంకులను, పరిసరాలను పరిశీలించి సూచనలు ఇచ్చారు. వర్షాకాలంలో దోమలు వృద్ధి చెందకుండా జాగ్రత్తలు పాటించాలని, నాణ్యమైన ఆహారాన్ని అందించాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ అబీదాబీ బేగం, ఉపాధ్యాయులు, సిబ్బంది ఉన్నారు.

ఇంటి వద్ద రేషన్ ఇవ్వకుంటే చర్యలు

ఉయ్యాలవాడ, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): 65 ఏళ్ల పైబడిన వృద్ధులకు ఇంటి వద్దకు వెళ్లి రేషన్ సరుకులు ఇవ్వకుంటే చర్యలు తప్పవని తహసీల్దారు సువర్ణదేవి హెచ్చరించారు. శనివారం రేషన్ డీలర్లతో ఆమె సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలో 65 ఏళ్ల పైబడిన వృద్ధులు 1,339 ఉన్నారన్నారు. వీరికి ప్రతి నెల 25 నుంచి 30వ తేదీలోపు రేషన్ సరుకులు ఇళ్ల వద్దకు ఇవ్వాలన్నారు. ప్రతి నెల 1 నుంచి 15వరకు ఉదయం 8 గంటల నుంచి 12 గంటల వరకు, సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు రేషన్ షాపులు తెరచి ఉంచాలన్నారు. విధుల్లో నిర్లక్ష్యం చేయరాదని సూచించారు.

ఎయిడ్స్ నిర్మూలనపై అవగాహన

డోన్ రూరల్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో శనివారం హ్యాండ్స్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఎయిడ్స్ నిర్మూలనపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రాజెక్టు మేనేజర్ మధుకుమార్ మాట్లాడుతూ హెచ్ఐవీ (ఎయిడ్స్) ఎలా వ్యాపిస్తుంది.. ఎలాంటి నివారణ చర్యలు తీసుకోవాలో వివరించారు. ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ ప్రసాద్ రెడ్డి, హ్యాండ్స్ సిబ్బంది సరస్వతి, సోఫియా, రాజేశ్వరి పాల్గొన్నారు.

సురవరం సుధాకర్ రెడ్డికి నివాళి



సురవరం సుధాకర్ రెడ్డి చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న సీపీఐ అనుబంధ సంఘాల నాయకులు

డోన్ రూరల్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): సీపీఐ జాతీయ మాజీ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర్‌రెడ్డి మృతికి ఆ పార్టీ నాయకులు సంతాపాన్ని వ్యక్తం చేశారు. పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీపీఐ మాజీ మండల కార్యదర్శి పులిశేఖర్, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి లక్ష్మీనారాయణ, జిల్లా చేతి వృత్తిదారుల సంఘం కార్యదర్శి రామ్మోహన్, కలిచెట్ల చంద్రశేఖర్ ఉన్నారు.

నల్లబ్యాడ్జీలతో నిరసన

డోన్ రూరల్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): డోన్ అటవి శాఖ అధికారులు శనివారం నల్లబ్యాడ్జీలతో అటవి శాఖ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. శ్రీశైలం అటవిశాఖ సిబ్బందిపై జరిగిన దాడిని ఖండించారు. కార్యక్రమంలో డోన్ అటవి శాఖ డీఆర్వో రవీంద్రనాయక్, డి.మౌలాలి, సిబ్బంది పాల్గొన్నారు.

వెంకటాపురం చెరువుకు హారతి



జలహారతి ఇస్తున్న వేద బ్రాహ్మణ సంఘం సభ్యులు

డోన్ టౌన్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): శ్రావణ మాసం బహుళ పోలాల అమావాస్య సందర్భంగా శనివారం శ్రీవేద మాత బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో వెంకటాపురం చెరువుకు గంగా హారతి ఇచ్చారు. శతావధాని గుండ్లూరి దత్తాత్రేయ శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం పోలాల అమావాస్య గురించి భక్తులకు వివరించారు. కార్యక్రమంలో సంఘం సభ్యులు ఎన్.శంకర్‌శర్మ, ఉపాధ్యక్షుడు కళ్లె శేషావలి శర్మ, సెక్రటరీ దరూర్ శ్రీనివాస్, కన్వీనర్ గంగాధర్ శాస్త్రి, ఇలపావనం సాయి ప్రణీత్‌శర్మ, గోపాల్‌శర్మ, కరణం రాజేశ్వరరావు, ఎం.భరద్వాజ శర్మ, కరణం కేశవరావు, నాగరాజన్ శర్మ, కళ్లె అనురాధ, ఎన్.లక్ష్మీదేవి, శాంతి, శిరీష, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా టంగుటూరి జయంతి

ప్యాపిలి, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం టంగుటూరి ప్రకాశం పంతులు జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ రామక్రిష్ణయ్య, అధ్యాపకులు నవీన్‌పాటి, వెంకటరమణ, వెంకటేశ్వర్లు, మద్దిలేటి పాల్గొన్నారు.

కోవెలకుంట్ల: అలుపెరగని పోరాటం చేసిన యోధుడు టంగుటూరి ప్రకాశం పంతులు అని వాసవీ బొమ్మిడాల ప్రభుత్వ డిగ్రీకళాశాల వైస్ ప్రిన్సిపాల్ యు.వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. శనివారం కళాశాలలో టంగుటూరి ప్రకాశం పంతులు 154వ జయంతిని ఘనంగా నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో అధ్యాపకులు పాల్గొన్నారు.

వైభవంగా చెన్నకేశవ పల్లకీ ఉత్సవం

చాగలమర్రి, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెల్లాల క్షేత్రంలో చెన్నకేశవ, సంజీవరాయ ఉత్సవమూర్తుల పల్లకీ ఉత్సవం వైభ వంగా నిర్వహించారు. శ్రావణ శనివారం కావడంతో వేద పండితుల ఆధ్వర్యంలో ఉత్సవమూర్తులకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆశ్రమ పీఠాధిపతి అభినవ శంకరాందస్వామి, ఆలయ ఈవో వెంకటరమణ, కమిటీ సభ్యులు లక్ష్మీనారాయణరెడ్డి, నరసింహారెడ్డి, రామసుబ్బారెడ్డి, సుబ్బిరెడ్డి, మహిళలు పాల్గొన్నారు. మూడురాళ్లపల్లె, శెట్టివీడు గ్రామాల్లో ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమాల్లో ఆల య కమిటీ సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు, డ్రైనేజీ పనులకు ప్రతిపాదనలు

చాగలమర్రి, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): చాగలమర్రి గ్రామంలోని ముత్యాలపాడు బస్టాండులో నిత్యం ప్రవహిస్తున్న మురుగునీటి తొలగింపునకు శనివారం అధికారులు చర్యలు తీసుకున్నారు. డిప్యూటీ ఎంపీడీవో తాహిర్‌హుసేన్, ఈవో తారకేశ్వరి మురుగునీటిని పరిశీలించారు. మురుగు నీరు పోయేందుకు డ్రైనేజీ, సీసీ రోడ్డు పనులు చేయుటకు ప్రతిపాదనలు పంపామన్నారు. కార్యక్రమంలో ఏఈ కొండారెడ్డి, పంచాయతీ సిబ్బంది ఉన్నారు.

మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షిద్దాం

దొర్నిపాడు, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించుకుందామని ఎంపీడీవో సావిత్రి అన్నారు. శనివారం స్వచ్ఛంద్ర.. స్వచ్ఛదివస్ కార్యక్రమంలో భాగంగా డబ్ల్యూ.కొత్తపల్లె వైద్యశాలలో మొక్కలు నాటారు. మొక్కల సంరక్షణ బాధ్యత అందరిదన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి ఉసేని, వైద్య సిబ్బంది, సచివాలయ సిబ్బంది తదితరులున్నారు.

అధికారుల శ్రమదానం

ఉయ్యాలవాడ, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): స్వచ్ఛ ఆంధ్ర - స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా శనివారం అధికారులు శ్రమదానం చేశారు. ఎంపీడీవో ఉమామహేశ్వరరావు, ఉపాధి ఏపీవో హరిక్రిష్ణ కలిసి మట్టిని తొలగించారు. ఉపాధి సిబ్బందితో కలిసి కార్యాలయం పరిసరాలను పరిశుభ్రం చేశారు. కార్యక్రమంలో తహసీల్దారు సువర్ణదేవి, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

రైతు సమస్యలపై నిరంతర పోరాటం

కొలిమిగుండ్ల, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి) : రైతు సమస్యలపై సీపీఐ నిరంతరం పోరాటం సాగిస్తుందని రైతు సంఘం అధ్యక్షులు పుల్లయ్య అన్నారు. శనివారం మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన రైతులు, సీపీఐ కార్యకర్తలు చలో ఒంగోలు కార్యక్రమానికి తరలి వెళ్లారు. రాష్ట్ర మహాసభల్లో రైతుల సమస్యలే ప్రధాన అజెండా గా చర్చిస్తారని వారు అన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ సూర్యనారాయణ, పుల్లయ్య, చంటి, వేణుగోపాల్‌రెడ్డి, గుజ్జులపెద్దయ్య, రామ్మోహన్, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

మట్టి విగ్రహాలను ఏర్పాటు చేసుకోవాలి

బనగానపల్లె, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణలో భాగంగా మట్టి విగ్రహాలను ఏర్పాటు చేసుకోవాలని వృక్షశాస్త్ర అధ్యాపకురాలు వసుంధర సూచించారు. శనివారం బనగా నపల్లె ప్రభు త్వ డిగ్రీ కళాశాలలో వృక్షశాస్త్రం ఆధ్వర్యంలో పర్యావరణ పరిరక్షణ ప్రదర్శనలో భాగంగా విద్యార్థులు తయారు చేసిన మట్టి వినాయక విగ్రహాలను ఊరేగించారు. మట్టి వినాయకుని విశిష్టతను, పర్యావర ణ పరిరక్షణ గురించి అధ్యాపకులు విద్యార్థులకు వివరించారు. వినాయకుని పూజలో ఉపయోగించి 21 రకాల మొక్కలు, వాటి ఔషధ ప్రాముఖ్యతను విద్యార్థులు వివరించారు. ఈసందర్భంగా వృక్షశాస్త్ర అధ్యాపకులురాలు వసుంధర విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.